నిర్మిస్తుందా.. విస్మరిస్తుందా

గృహ నిర్మాణాలపై కాంగ్రెస్ అనుమానం

విశాలాంధ్ర- పులివెందుల: వైసీపీ ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందా.. లేక విస్మరిస్తుందా అంటూ గృహ నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ అనుమానం వ్యక్తంచేసింది. ఆ మేరకు ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి పట్టణ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న జగనన్నకాలనీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టి దరిదాపు నాలుగేళ్లు పూర్తికావస్తున్నా ఇప్పటికీ గృహాలు అసంపూర్తిగా ఉండటం చూస్తే ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించలేదన్నారు. రెండేళ్ల క్రితం ఇక్కడ సుమారు 7వేల పైచిలుకు పేదలకు నివాసయోగ్యమైన కాలనీకి అట్టహాసంగా ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారన్నారు. కానీ అవి ఇంత వరకు గృహ నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్నట్లు పలువురు లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. పేదలపై ముఖ్యమంత్రి జగన్‌కు ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. అధికారులు కూడా గృహ నిర్మాణ పనుల పట్ల శ్రద్ధ చూపలేదన్నారు. మరి ఈ గృహాలు ఎప్పటికి పూర్తవుతాయో అర్థంకాని ప్రశ్నగా మిగిలిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పటిష్టమైన ఇళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. కావున రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌పార్టీని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, తిరుపాల్‌రెడ్డి ఉన్నారు.

ల్యాబోరేటరీ తనిఖీ



విశాలాంధ్ర- వేముల: తాళ్లపల్లి, వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ల్యాబోరేటరీని మంగళవారం పులివెందుల మలేరియా సబ్-యూనిట్ అధికారి సిద్దయ్య ల్యాబ్ తనిఖీ చేసి రికార్డులు పరిలించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్‌లు హరి ప్రసాద్, శివశంకర్‌లను ఇప్పటి వరకు ఏమైనా మలేరియా కేసులు నమోదు అయినాయ అని వివరాలు తెలుసుకుని, ప్రతి ఆరోగ్య కార్యకర్త గ్రామాలకు వెళ్ళినప్పుడు మలేరియా లక్షణాలు ఉన్నట్లు అయితే తప్పని సరిగా రక్తపరీక్ష చేయాల ని సూచించారు. హాస్పిటల్ కు వచ్చిన వారికీ జ్వరం ఉన్నట్లు అయితే రక్తపరీక్ష చేసి వ్యాధి నిర్ధారణ చేసి డాక్టర్‌కి తెలియజేయాలని వెల్లడిం చారు. జ్వరంతో వచ్చినవారికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు అయితే పులివెందుల ఏరియా హాస్పిటల్ వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని, ల్యాబ్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ల్యాబ్ టెక్నీషియన్‌లు హరి ప్రసాద్, శివశంకర్ లకు సిద్దయ్య తెలియజేశారు.

ఓటమిని జీర్ణించుకోలేక దళిత ఎమ్మెల్యేపై దాడి : టీడీపీ

విశాలాంధ్ర - చెన్నూరు : పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమిని జీర్ణించు కోలేక రాష్ట్ర అసెంబ్లీలో తెదేపా దళిత ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి మీద వైసిపి రౌడీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు యామల మణికంత నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణికంత మాట్లాడుతూ మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాక్షస రాజ్యంలో ఉన్నామా అనే అనుమానం వస్తుంది. అసెంబ్లీలో టిడిపి దళిత ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామిపై వైసీపీ ఎమ్మెల్యేల దాడిని ఖండిస్తున్న,టిడిపి ఎమ్మెల్సీల గెలుపుని చూసి ఓర్వలేక వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా టిడిపి ఎమ్మెల్యేలపై దాడి చేశారు. ఈ రాక్షస పాలకులకు ప్రజలు తొందరలోనే తగిన బుద్ధి చెప్తారన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే జీఓ 1 రద్దు చేయాలని డిమాండ్ చెయ్యడం కూడా జగన్ పాలనలో నేరమేనా, ఉన్నత విలువలతో సుధీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న దళిత ఎమ్మెల్యే స్వామి, సీనియర్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరిగారి మీద దాడి చెయ్యడం దుర్మార్గం, అసెంబ్లీలో జరిగిన ఘటనని ప్రజాస్వామ్యవాదులు అందరూ తీవ్రంగా ఖండించాలని ఆయన అన్నారు.

శ్రీ సాయి హైస్కూల్‌లో ముందస్తు ఉగాది సంబరాలు



విశాలాంధ్ర- సిద్దవటం : సిద్దవటం శ్రీ సాయి హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు ఉగాది సంబరాలను నిర్వహించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ పోలు వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు నూతన సంప్రదాయ వస్త్రాలను ధరించి ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితం లో ఏర్పడే బాధ, కష్టం, సంతోషం మొదలైన భావనల గుర్తుండేలా ఉగాది పచ్చడిని స్వీకరించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రేవతి దేవి, హెడ్మాస్టర్ రాజేష్, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలూరు ఉగాది శుభాకాంక్షలు



విశాలాంధ్ర-పులివెందుల టౌన్: కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో అంతా మేలు జరగాలని, కరువు కాటకాల నుంచి విముక్తి కల్పించాలని, అలాగే అందరికీ ఆయురారోగ్యాలతో పాటు భోగభాగ్యాలను ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.

నేటి నుండి అంకాలమ్మ గుడి ఉత్సవాలు



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని చెమ్ముమియ్య పేట, తారకరామా నగర్, వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ వెనుక ఉన్న అంకాలమ్మ గుడి ఉత్సవాలు 22, 23 తేదీలలో జరుగనున్నట్లు ఆలయ నిర్వాహకులు లింగారెడ్డి, విశ్వనాథరెడ్డి, వల్లెపు రాజు, మురళి, రాజులు తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 22 వ తేదీ బుధవారం ఉదయం 7:45 నిమిషాలకు లోక కళ్యాణార్థమైన శాంతి హోమం జరుగుతున్నట్లు తెలిపారు. అలాగే 23 తేదీన గురువారం దేవాలయ ఉత్సవాల సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు అనంతరం మూడు గంటల నుండి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి 40వేలు, రెండో బహుమతి 30 వేలు, మూడో బహుమతి 20వేలు, నాలుగో బహుమతి 10వేలు, ఐదో బహుమతి 5వేలు గా పోటీలలో విజేతలకు అందించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని అమ్మవారి ఆశీస్సులు పొంది ఉత్సవాలలో పాల్గొని తెలిపారు.

నీటి పొదుపు మనందరి బాధ్యత

విశాలాంధ్ర- వేంపల్లె: నీటిని పొదుపు చేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు అన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశానుసారంగా స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్, ఎన్.వై.కే వారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నీటి విలువను ,సంరక్షణ పద్ధతులను వివరించారు. ఎన్ వై కే పులివెందుల కోఆర్డినేటర్ సుబ్బయ్య నీటిని ఏ విధంగా పొదుపు చేయవచ్చో విభిన్న ఉదాహరణల ద్వారా వివరించారు .ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓబు ల్ రెడ్డి నీటిని మనం ఉన్న ఇంటిలో లేదా గ్రామంలో ,తమ వ్యవసాయ పద్ధతుల లో ఎలాగు పొదుపు చేయవచ్చో దాని బాధ్యత మన మీద ఎంతో ఉన్నదని విద్యార్థులకు విశదీకరిం చారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ,అధ్యాప కులు, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఎన్సిసి విద్యార్థులతో కలిసి ర్యాలీగా వేంపల్లి నాలుగు రోడ్లు కూడలి వద్దకు వెళ్లి మానవహారంగా ఏర్పడి జల ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదగాలి

విశాలాంధ్ర - చెన్నూరు : విద్యార్థులు మంచి ఉన్నత విద్యను అభ్యసించి, భావి భారత పౌరులుగా ఎదగాలని, అలాగే కన్నవారికి, గురువు లకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని జడ్పీటిసి ముదిరెడ్డి దిలీప్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు సేవ్ ద చిల్డ్రన్ ఆర్గనైజేషన్ సన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ల్యాబ్ ఏర్పాటు చేసి 5 లక్షల రూపాయలతో విలువచేసే పిఎస్ అండ్ బిఎస్ ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ ను జడ్పీటిసి దిలీప్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లోమడ లక్ష్మీదేవి ద్వారా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు ఎనలేని ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందని, నేటి సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా, మంచి ఉన్నత చదువును ఇస్తే చాలు అనే విధంగా సమాజం ఉందన్నారు, అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని దృక్పథంతో తల్లిదండ్రులకు డబ్బులు ఇచ్చి పిల్లలను చదివించడం జరుగుతుందని తెలిపారు, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో ఎలా ఉన్నాయి అంటే కార్పొరేట్ పాఠశాలలకు తలదన్నేలా ఉన్నాయని తెలిపారు. అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉండడమే కాకుండా విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బట్టలు, షూస్, బ్యాగులను ఇవ్వడమే కాకుండా, మంచి రుచికరమైన పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విమలమ్మ, ఉపాధ్యాయులు రమణారెడ్డి,గంగాధర్, వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగిజావతో పోషక విలువలు



విశాలాంధ్ర - కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుండి పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట రాగి జావా జగనన్న గోరుముద్దలో మరో పోషకహారం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మండల విద్యావరణల అధికారి జాఫర్ సాదిక్ తెలిపారు. ఈ సందర్భంగా రాగిజావ పంపిణీ కార్యక్రమం ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షురాలు గండి భారతి జడ్పీటిసి సుమిత్ర రాజశేఖర్ రెడ్డి ఉప ఎంపీపీ చెన్నకేశవరెడ్డి సర్పంచుల సంఘం అధ్యక్షుడు గంగవరం రామసుబ్బారెడ్డి డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ ఎం వి. సుబ్బారెడ్డి మండల కన్వీనర్ ఉత్తమ రెడ్డిలు తోపాటు నగర చైర్ పర్సన్ మార్పూరి మేరి వైస్ చైర్మన్ మహమ్మద్ సాదిక్ (నారద బ్రదర్స్)లు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు నగర పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలలో రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కు పోషక విలువలు అందించడంలో భాగంగా రాగి జావా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఆయా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర- బ్రహ్మంగారి మఠం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్నా గోరుముద్దలో భాగంగానే రాగిజావ ను ప్రారంభించారు. అందులో భాగంగానే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాలలో రాగిజావను విద్యార్థులకు అందచేశారు. ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు వీరనారాయణరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎంఈఓ పుల్లయ్య ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్ రామయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశఫెట్టిన జగనన్నా గోరుముద్ద పథకంలో భాగంగా ప్రతి పాఠశాలలో రోజు మెనూలో భాగంగా చిక్కీలు, గుడ్డు అందించడం జరుగుతుందని అన్నారు. విధ్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే రాగిజావను ప్రారంభించడం జరిగిందన్నా రు. మూడు రోజుల పాటు బెల్లంతో కూడిన రాగిజావను అందించడం జరుగుతుందని అన్నారు. పాఠశాలను నాడు-నేడులో భాగంగా కోట్లాది రూపాయలతో ప్రారంభించడం జరిగిందని అన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విధ్యార్థులకు వీడ్కోలు సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు జరగబోవు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు.

నగరంలో అతిపెద్ద హరూన్ కార్ల షోరూం

టాటా మోటార్స్ కడపకు రావడం శుభ పరిణామం: డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : వైఎస్ఆర్ జిల్లాలో విశాలమైన, అత్యాధునిక సదుపాయాలతో.. హరూన్ కార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో టాటా మోటార్స్ కార్ల షో రూమ్ కడపకు రావడం శుభ పరిణామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు.మంగళవారం నగర శివారులోని తిరుపతి- హైదరాబాద్ హైవేలో మాడ మీద పల్లి నందు హరూన్ మోటార్ అధినేత అహ్మద్ భాష నూతనంగా స్థాపించిన "టాటా మోటార్స్ ప్యాసింజర్ కార్ల షోరూం"కు ఆర్. సి.ఎఫ్.ఐ కమర్షియల్ ఈవి వెహికల్స్ హెడ్ రమేష్ దొరై రాజన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష ముఖ్య అతిధులుగా హాజరై షోరూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రారెడ్డి, డాక్టర్ సుధా,రఘురామి రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ..హరూన్ కుటుంబం నుండి వచ్చిన అతి పెద్ద కార్ల షోరూంను నా చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.ఈ నూతన కార్ల షో రూమ్ లో అద్భుతమైన ఫీచర్స్, మోడ్రన్ టెక్నాలజీతో కొత్త %అవఇశీఅ% ఈ.వి, టిగార్ ఈవి లతోపాటు హారియర్ దార్క్ వెహికల్, సఫారీ దార్క్ నూతన ఎడిషన్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా లేనంత విశాలమైన , అత్యధిక టెక్నాలజీ ఉన్న పెద్ద వర్క్ షాప్, సర్వీస్ సెంటర్ ఉందని తెలిపారు.హరూన్ బజాజ్ వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా, నగర వినియోగదారులకు ఉత్తమ సేవలందించి వినియోదారుల మన్ననలు పొందాలని అన్నారు.వ్యాపారంలో రాణించే ప్రతి ఒక్క వ్యాపారీ.. వినియోగదారులను దైవంతో సమానంగా భావించినపుడే.. అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. భవిష్యత్తులో మరింత గొప్ప స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో..డిప్యూటీ మేయర్లు నిత్యానంద రెడ్డి, ముంతాజ్ బేగం, వైఎస్సార్సిపి సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, సుభాన్ భాషా, నగర కార్పొరేటర్లు, వైయస్ఆర్సీపీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ అధ్యక్షులు



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్‌ని కడప హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చిన్నపరెడ్డి సలహా మేరకు కడప హోటల్స్ ఫుడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రషీద్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి హోటల్స్ వారు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ విజయ రామరాజు దృష్టికి తీసుకువెళ్లారు. రషీద్ ఖాన్ మాట్లాడుతూ హోటల్స్‌కు రాత్రి 10:30 గంటల వరకు ఉన్న పోలీస్ పర్మిషన్ సమయాన్ని పవిత్ర రంజాన్ నెల సందర్భంగా రాత్రి 12 గంటల వరకు కడప లోని హోటల్స్ తెరిచేలా చూడాలని, అలాగే సాధారణంగా ఉన్న సమయాన్ని 11 గంటల వరకు ఉండేలా చూడాలని కోరారు. అందుకు పోలీసులు అనుమతి, సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప హోటల్స్ అండ్ ఫుడ్ అసోసియేషన్ ఉప కోశాధికారి కిరణ్‌కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జ్యోతుల మహోత్సవం

విశాలాంధ్ర- యర్రగుంట్ల : స్థానిక ముద్దనూరు రోడ్డులోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో పవిత్ర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం అమ్మవారి జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు బిందెసేవ కార్యక్రమం ఆలయం వద్ద నుండి నడిఊరు రామాలయం వరకు కొనసాగనుంది. అలాగే అర్థరాత్రి 12 గంటల తరువాత శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతుల ఊరేగింపు కార్యక్రమం నాలుగు రోడ్ల కూడలి వరకు కొనసాగి తిరిగి ఆలయం చేరుకుంటుంది. భక్తాదులు ఈ కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. ఇటీవలే ఆలయ ప్రాంగణంలో ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. జ్యోతుల ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు పూజలకు అవసరమైన పుష్పాదులను బయటి ప్రాంతాల నుండి ప్రత్యేకంగా తెప్పించారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నీరు, పారిశుద్ధ్య సంక్షోభాన్ని పరిష్కరించ డానికి, మార్పును వేగవంతం చేయ డానికి సమాజంలో ప్రతి ఒక్కరూ నడుము బిగించాలని ప్రపంచ జల దినోత్సవం-2023 సందర్భంగా, కడప నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో కళాశాల సభా సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థి (1984) బ్యాచ్ వి. రామంజులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జల వనరుల శాఖ వారు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి చక్రం అంతట పనిచేయకపోవడం, ఆరోగ్యం, ఆకలి, లింగ సమానత్వం, నుండి విద్య,ఉద్యోగ, పరిశ్రమ, విపత్తుల నుండి శాంతి కొరకు అన్ని ప్రధాన ప్రపంచ సమస్యలపై పురోగతిని బలహీన పరుస్తుందన్నారు. గవర్నమెంట్ పాలిటెక్నికల్ కళాశాల వేంపల్లి కేలే మహిళా ఇంజనీరింగ్,కెఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఎస్సే రైటింగ్, మోడల్ మేకింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, ఎలోక్యూషన్ వంటి పరీక్షలలో మొదటి, ద్వితీయ స్థానంలో, ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మొమెంటోలను, క్యాష్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌గా హాజరైన కళాశాల పూర్వ విద్యార్థి సి.సి.రాజశేఖర్ రెడ్డి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జలవరణం శాఖ కడప, డాక్టర్ ఎస్. ఆర్.లక్ష్మీ ప్రసాద్ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ వేంపల్లి , కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రధానచార్యులు డాక్టర్ వీ.ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ భాద్య విభాగాధిపతి డాక్టర్ టి. కిరణ్ కుమార్, ప్రోగ్రాం సమన్వయకర్తలు ఆచార్య టి. కిరణ్ కుమార్, కె.నివేదిత, అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విఫత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలి !



విశాలాంధ్ర- కడప కలెక్టరేట్ : ఎలాంటి ఊహించని విఫత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేం దుకు.. ఎన్.డి. ఆర్.ఎఫ్. భద్రతా సిబ్బంది కల్పించే అవగాహన కార్యక్రమాల నిర్వహణకు.. పోలీసు, ఫైర్, రెవెన్యూ.. అన్ని శాఖల అధికారులు సహకరించా లని డిఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని విసి హాలులో ఎన్.డి.ఆర్.ఎఫ్. కమాండెంట్ శివ కుమార్, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, జిల్లా విఫత్తుల నిర్వహణ శాఖ, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ జి. వి.ఎస్. రాంప్రకాశ్ లతో కలిసి డిఆర్వో గంగాధర గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విఫత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు.. జాతీయ విఫత్తుల నిర్వహణ టీమ్ అన్ని జిల్లాల్లో మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా.. మన జిల్లాలో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ (సి.బి.ఆర్.ఎన్.) ఉత్పాదక ప్రాంతాల్లో హానికర ప్రభావిత అవకాశాలను గుర్తించేందుకు సంబందిత శాఖల అధికారులు, ఫ్యాక్టరీల నిర్వహకులు, సంబందిత ప్రాంతాలతో భాగస్వామ్యం కలిగిన, మెషినరీ, జిల్లా అథారిటీస్, స్థానిక సంస్థలు, సామాజిక స్వచ్ఛంద కార్యకర్తలు, సి.ఏ.పి.ఎఫ్., ఇతర భాగస్వాములతో కలిసి పలు చోట్ల సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అందుకు సంబంధించి.. నిర్వహణ తేదీలను కూడా తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో.. ఎన్.డి.ఆర్.ఎఫ్. టీమ్ రామకృష్ణ, జిల్లా విఫత్తుల నిర్వహణ శాఖ, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ జి. వి.ఎస్. రాంప్రకాశ్, ఏ.ఆర్. పోలీసు, విద్యుత్ శాఖ, డిఎహెచ్ఓ, పరిశ్రమల శాఖ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాగిజావా పంపిణీ



విశాలాంధ్ర- పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాగిజావా పంపిణీ చేశారు. వేసవి ప్రారంభం కావడం, ఉష్ణోగ్రత్తలు కూడా పెరిగిపోవడం వంటి పరిస్థితులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఈ రాగిజావా పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వేసవిలో విపరీతమైన ఎండలకు రాగిజావా ఎంతో ఎంతో ఊరటనిస్తుంది. ఈ క్రమంలో అన్ని పాఠశాలల్లో రాగి జావా విద్యార్థులకు అందజేశారు . కాగా 22వ వార్డు కౌన్సిలరు కొండల్‌రావు సత్రంబడి పాఠశాలలో సుమారు 200 గ్లాసులను వితరణ అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో రాగిజావా విద్యార్థులకు పౌష్టిహారమన్నారు. ఎంఈఓ వీరారెడ్డి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని రాగిజావా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించడం సంతో సంతోషంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాలల్లో రాష్ట్ర డైరెక్టరు హాలు గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు మూలి గంగామహేశ్వరరెడ్డి, అలమూరు విజయకుమార్ నాయుడు, పార్నపల్లె కిశోర్, కోడి రమణ, లక్ష్మిభార్గవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

24న జంతువధశాల, మార్కెట్ వేలంపాట

విశాలాంధ్ర - చెన్నూరు : చెన్నూరు గ్రామ పంచాయతీకి సంబంధించి బస్టాండు, కూరగాయల మార్కెట్, జంతు వధశాలకు సంబంధించి గ్రామ పంచాయతీ సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 24వ తేదీన మధ్యాహ్నం మధ్యాహ్నం 3 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు వారి ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లించి ఉండాలని, అలాగే డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

నాడు-నేడు పనులను పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర- బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు రెండో విడత పనులను పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు విజయకుమారితో కలిసి ఎంపీపీ వీరనారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశఫెట్టిన నాడు-నేడు పనులు రెండో విడతగా ఈ పాఠశాలకు అదనపు తరగతి గదులను, ఎనిమిది రూములను నియమించడం జరిగిందని పనులు వేగవంతంగా చేయాలని అన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే మన మండలంలో నాడు-నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మెటీరియల్ ఏమన్నా పెండింగ్‌లో ఉండే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామయ్య, మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య, వైకాపా నాయకుడు పాలరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతుల్లో భారీగా అవకతవకలు

నిబంధనలకు తిలోదకాలు -కలెక్టర్ విచారించి చర్యలు తీసుకోవాలి : ఏఐటియుసి

విశాలాంధ్ర-కడప రూరల్ : జిల్లాలో అంగన్వాడీ టీచర్స్ పదోన్నతులపై వెళ్లిన, రిటైర్మెంట్ అయి ఖాళీ అయిన వాటి నియామకాలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయకుండా నిబంధనలకు తిరోధకాలిచ్చి లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని అర్హులు కాని ఆయాలకు టీచర్స్ గా పదోన్నతులు కల్పిస్తున్న జిల్లా ఐసిడిఎస్ అధికారులపైన జిల్లా కలెక్టర్ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూ సీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక హెూచిమిన్ భవన్ యందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ జిల్లాలో ఒక్కొక్క ప్రాజెక్టులో ఒక్కొక్క విధంగా నిబంధనలు ఉండవని అందరికీ ఒకేలా నిబంధనలో ఉంటాయన్నారు. పొద్దుటూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అమృత నగర్ అంగన్వాడి కేంద్రంలోని ఆయా రామరత్నమ్మను పొద్దుటూరు మున్సిపాలిటీ సుబ్బిరెడ్డి కొట్టాలు అంగన్వాడి కేంద్రానికి కార్యకర్తగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ దగ్గరికి సిఫార్సు చేయడం స్థానికురాలు కాకపోయినా ఆధార్ కార్డులో రేసిడెంట్స్ సంజీవరెడ్డి నగర్ లో ఉన్న తాత్కాలిక మార్చుకుని నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఎట్లా పదోన్నతి కల్పిస్తారని దీని వెనక లక్షల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. గతంలో ఎర్రగుంట్లలో నాగ తులసి పదోన్నతి బదిలీ విషయమై జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించాలని పదోన్నతి రద్దు చేస్తూ ఆర్డర్ ఇవ్వడం జరిగిందని దీనిని జిల్లా వ్యాప్తంగా ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడి కార్యకర్తల పోస్టులను నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేసేందుకు కలెక్టర్ జిల్లా ఐసీడీఎస్ అధికారులు పైన ఒత్తిడి తీసుకురావాలని ఇటీవల కాలంలో పదోన్నతుల పైన విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియుసి నాయకులు తారక రామారావు, నరసింహులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



వక్ఫ్ బోర్డు ఆస్థులను పరిరక్షించాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వక్ఫ్ బోర్డు ఆస్థులను కాపాడాలని, ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, మైనార్టీ నాయకులు షరీఫ్‌లు మాట్లాడుతూ జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్థులను పరిరక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ఆక్రమణ దారుల నుండి వక్ఫ్ భూములను కాపాడాలని ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు స్పందించడం లేదని అన్నారు. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలో మోడమీది పల్లి మసీదుకు సంబంధించిన వక్ఫ్ భూమి 13వ గెజిట్‌లో సీరియల్ నంబరు 175గా నమోదు అయిన సర్వే నంబరు 278/1లో ఒక ఎకరా 2సెంట్లు గజాల్లో నమోదు కాగా అందులో 25సెంట్లు మాత్రమే రికార్డులలో ఎక్కించడం జరిగిందని అన్నారు. అధికారులు స్పందించకపోవడంతో చాపాడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందనలో 20.12.2022వ తేదిన ఫిర్యాదు నెం.706/26/12/2022గా ఫిర్యాదుచేయడం జరిగిందని అన్నారు. ఆస్థులను పరిరక్షించడంలో పూర్తిగా విఫలమైన అధికారులను తక్షణం విధుల నుండి తొలగించాలని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే వక్ఫ్ స్థలాలు ఎక్కడైతే ఉన్నాయో పరిశీలించి సర్వే చేసి, హద్దులు ఏర్పాటుచేసి, ప్రహారీ గోడలను నిర్మించి, సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు

పట్టించుకోని పురపాలిక యంత్రాంగం- మున్సిపల్ ఆదాయానికి గండి- చిరువ్యాపారులపైనే దృష్టి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పారిశ్రామిక ప్రాంతమైన ఎర్రగుంట్ల పురపాలిక పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా శాశ్వత ఆదాయాన్ని సమకూర్చుకునే దిశగా మున్సిపల్ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. పురపాలిక పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులు లేవని తరచూ అంటూ ఉంటారు. కానీ క్షేత్రస్థాయిలో నిబంధనల మేరకు ఆదాయాన్ని సమకూర్చుకునే దిశగా ఆలోచన చేయకపోవడం విడ్డూరం అనిపించక మానదు. స్థానికంగా సుమారు 180 వరకు నాపరాళ్ల పాలీషింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు విధిగా పొందాల్సి ఉంటుంది. ప్రతి ఏటా రూ.2వేలు చెల్లించి ట్రేడ్ లైసెన్స్ పునరుద్దరించుకోవాలన్న నిబంధన ఉంది. అయితే ట్రేడ్ లైసెన్స్‌ల వ్యవహారాన్ని సంబంధిత అధికారులు పక్కకు నెట్టడం ఎవరి ప్రయోజనాల కొరకో అర్థం కాని విషయం. పాలీషింగ్ యూనిట్ల యజమానులకు ఏడాదికి రూ.2వేలు చెల్లించడం పెద్ద భారం కాదు. అయినప్పటికీ వారు ట్రేడ్ లైసెన్స్‌ల ఊసే లేకపోవడం గమనార్హం. ఎర్రగుంట్ల 2012లో గ్రామ పంచాయతీ నుండి నగర పంచాయతీగా రూపాంతరం చెందిన పిదప 2016లో మాత్రం 38 మంది నాపరాళ్ల పరిశ్రమల యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు పొంది ఉన్నారు. కానీ వీరిలో ముగ్గురో, నలుగురు మినహా మిగిలిన వారు మరుసటి ఏడాది ఆ లైసెన్స్‌లను పునరుద్దరించుకోకపోవడం గమనార్హం. అయినప్పటికీ పురపాలిక అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో బోధపడని అంశం. సహజంగా నాపరాళ్ల పరిశ్రమల ద్వారా విధిగా ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు వసూలు చేయగలిగితే ప్రతి ఏటా రూ.3.60లక్షలకు తగ్గకుండా ఆదాయం సమకూరుతుంది. ఈ లెక్కన గత దశాబ్ది కాలంగా సుమారు రూ.36లక్షల మేర ఆదాయాన్ని పురపాలిక కోల్పోవడం ఆశ్చర్యం కలిగించకమానదు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ మౌలిక వసతులు మృగ్యం అయి ఉన్నాయి. ముఖ్యంగా ఎగుడుదిగుడు, గుంతలమయమైన రస్తాలు దర్శనమిస్తున్నాయి. ఇలాంటి చోట్ల సిమెంటు రోడ్ల నిర్మాణం అత్యవసరం. కానీ నిధుల లేమి పేరుతో అభివృద్ధి పనులను అటకెక్కించి చేతులు దులుపుకోవడం మినహా ఆదాయ వనరులపై దృష్టి సారించకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై ఎందుకు దృష్టి సారించలేకపోతున్నారన్న ప్రశ్నకు సమాధానం లభించడం లేదు. అలాగే పట్టణంలో పలు వ్యాపార సంస్థలు సైతం ట్రేడ్ లైసెన్స్ పొందకుండానే తమ వ్యాపారాలు కొనసాగిస్తుండడం మనం ప్రత్యక్షంగా చూడవచ్చు. పురపాలిక యంత్రాంగంతో పాటు సచివాలయాల వ్యవస్థ కూడా పనిచేస్తున్నప్పటికీ ఇలాంటి ఆదాయ వనరులపై అటు అధికారులు, ఇటు ఉద్యోగులలో ఆలోచన రాకపోవడం విశేషం.

జూన్ అనంతరం మూసివేత: పురపాలిక పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పొందని వ్యాపార సంస్థలను జూన్ మాసం అనంతరం మూసివేత దిశగా చర్యలు తీసుకుంటామని పురపాలిక కమీషనర్ పగడాల జగన్నాథ్ స్పష్టం చేశారు. నాపరాళ్ల యజమానులను ట్రేడ్ లైసెన్స్‌లు పొందేలా ప్రోత్సహిస్తామని చెప్పుకొచ్చారు. నిబంధనల మేరకు ప్రతి వ్యాపార సంస్థ ట్రేడ్ లైసెన్స్ విధిగా పొందాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా పురపాలిక కమీషనర్ చెప్పిన మేరకు జూన్ మాసం నుండి వ్యాపారసంస్థలు ట్రేడ్ లైసెన్స్‌లు పొందుతాయో లేదో వేచిచూడాలి.

జమ్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-వేంపల్లె: జమ్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యుత్ అధికారులకు టిడిపి కడప పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేదర రవికుమార్ విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని రామిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి బైలపటి జమ్మయ్య మరణించారన్నారు. ఇదే ప్రమాదంలో అతని భార్యకు రెండు చేతులు కాలాయన్నారు. ప్రస్తుతం జమ్మయ్య భార్య మాణిక్యాలు తన భర్త, తల్లి,అత్త మామలు ఆధారపడి ఉన్నారన్నారు. భర్త విద్యుత్ తీగ తగిలి మరణించడం వల్ల మా కుటుంబ సభ్యులు అనాధలుగా మరారరన్నారు. జమ్మయ్య భార్యకు ఎక్స్ గ్రేషియా కోరుతూ విద్యుత్ అధికారి రమేష్ రెడ్డికి జమ్మయ్య కుటుంబ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.. రమేష్ రెడ్డి స్పందించి మీకు ప్రభుత్వం తరఫున మీకు తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చినట్లు రవికుమార్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర- పులివెందుల: సింహాద్రిపురం మండల పరిషత్‌కార్యాలయం లో మంగళ వారం చలివేంద్రాన్ని ఎంపీడీఓ కృష్ణ మూర్తి ప్రారంభించారు. వేసవి ప్రారంభంకావడంతో అందరి దాహార్తిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి రాగి జావా

విశాలాంధ్ర - వల్లూరు : రాగిజావతో ఆరోగ్యం పరంగా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, జగనన్న గోరుముద్ద-రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారిని లిల్లెమ్మ విద్యార్థులకు సూచించారు. మంగళవారం గంగాయపల్లి ఆదర్శ పాఠశాల నందు ఉపాధ్యాయులతో కలిసి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి పాఠశాలలోనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద లో భాగంగా విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉండటం కోసం ప్రతి పాఠశాలలోనూ ఉదయం రాగిజావ విద్యార్థులకు అందించాలని సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

ఉగాది సందడి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలో ఉగాది సందడి కన్పించింది. గురువారం రోజున ఉగాది పండుగను నిర్వహించేందుకు నరంజామా సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంఓ పట్టణంలో పండుగ సామాగ్రి కోసం కోలాహలం కన్పించింది. ఏడాదిలో తొలి తెలుగు సంవత్సరాది కావడంతో ఏటా ఉగాది పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ పాటికి ఇతర ప్రాంతాలలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు వారి వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. ఏడాది పొడవునా కష్టాలు తొలగించి ఆపదల నుంచి గట్టెక్కించాలని, కరోనా వంటి మహమ్మారి దరిదాపుల్లోకి రాకుండా విముక్తి కల్పించాలని కోరుతూ దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేయడం పరిపాటి. ఏడాదంతా అంతా మేలు జరగాలని ఆశిద్దాం.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం రూ.17,65,000లు విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. 13 మందికి ఈ మొత్తం మంజూరైంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైసీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకంతో పాటు వైద్య సేవలు పొందిన అనంతరం సీఎం సహాయనిధి ద్వారా కొంత మొత్తాన్ని మంజూరు చేస్తూ ఆర్థిక వెసులుబాటు కల్పించడం జరుగుతోందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మం డల ఇన్‌చార్జి సురేంద్రారెడ్డి, కౌన్సిలర్ మహ్మద్ అలీ, కోఆప్షన్ సభ్యులు దాసరి సూర్యనారాయణరెడ్డి, తుమ్మలపల్లె గ్రామ సీనియర్ నేత రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృక్ష సంపదను కాపాడుకుందాం:తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: ఎంతో అరుదైన వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్‌పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకుని ఆయన విలేకరులతో మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః. చెట్లను మనం కాపాడుతే చెట్లు మనలని కాపాడుతాయన్నారు. అడవులు, చెట్లు లేకపోతే మానవజాతి మనుగడే లేదన్నారు.చెట్లు మనిషికి ప్రాణ వాయువు అందిస్తాయని తెలిపారు. మానవులు వదిలిన బొగ్గు పులుసు వాయువును స్వీకరిస్తాయని వెల్లడించారు. ఆక్సిజన్ ఓజోన్ పొర గా ఏర్పడి, సూర్య రష్మిలోని నీలలోహిత కిరణాల నుండి మానవులను రక్షిస్తుంని వివరించారు. మొక్కలు నాటడం, పెంచడం, పరిరక్షించడం ప్రభుత్వాల పవిత్ర బాధ్యత అన్నారు. ఈ బాధ్యతను వైకాపా ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. అశోకుడు చెట్లు నాటెను - జగన్ చెట్లు నరికెను అన్న విధంగా వైకాపా పాలన ఉండడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల సందర్భంగా అధికారులు పెద్ద పెద్ద చెట్లను కూడా నిర్ధాక్షిణ్యంగా నరకడం గర్హనీయమన్నారు.ఇక మీదుటనైన రాష్ట్ర ప్రభుత్వం చెట్లు నరికే కార్యక్రమాన్ని మానుకొని, మొక్కలు నాటి, పెంచి, పరి రక్షించే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాలని ఆయన సూచించారు.

చైతన్యలో ముందస్తు ఉగాది సంబరాలు

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె చైతన్య హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీ బి చక్రపాణి రెడ్డి విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు విలేకరులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది తెలుగువారు జరుపుకొనే పండు గలలో ఒకటని ఉగాది పండుగ విశిష్టతను పంచాంగ శ్రవణాన్ని గురించి ఆయన తెలియజేశారు అనంతరం నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి చక్రపాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎంఎల్సీలకే కుప్పి గంతులా?: వైసీపీ

విశాలాంధ్ర-సిద్దవటం : రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంఎల్సీ ఎన్నికల్లో కేవలం మూడు ఎంఎల్సీలను గెలుపొందినంత మాత్రాన ఏదో సాధించినట్లు టీడీపీ శ్రేణులు కుప్పి గంతులు వేస్తున్నారని సచివాలయ జేసీయస్ మండల కన్వీనర్ చింతకుంట రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని మూలపల్లి గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సుకు అధికారంలోకి రాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికీ చేరేలా నవరత్నాలను ప్రవేశ పెట్టారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పాలనకు కొలబద్దంగా తీసుకుంటారని టీడీపీకి ముందుంది ముసళ్ల పండుగ అని ఎద్దేవా చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ము, ధైర్యం టీడీపీ పార్టీకి గాని ఆ పార్టీ అధినేతకు ఉందానని సవాల్ విసిరారు. మీ పార్టీలాగ ఏ ఇతర పార్టీలతోనూ పొత్తులు, చీకటి ఒప్పందాలు వైఎస్ఆర్సీపీ పార్టీకి ఉండవన్నారు. పొత్తులతో కాదని ప్రజలతోనే తమ పార్టీ అధినేత ప్రయాణమన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో ఎక్కువగా పట్టభద్రులు మొదటి ప్రధాన్యత ఎవరికి ఇచ్చారో ముందుగా తెలుసుకోవాలని రెండవ ప్రాధాన్యతలో గెలిచారన్న సంగతి తెలుసుకోవాలన్నారు. ఎంఎల్సీ ఎన్నికల తరహాలో సార్వత్రిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండవ ప్రాధాన్యతలు ఉండవని ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : చదువుకుంటున్న విద్యార్థులకు ప్రతిఒక్కరూ తమకు తోచిన రీతిలో ముందుకు వచ్చి చేయూతను ఇవ్వాలని ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. బాగా చదువుకుంటున్న విద్యార్థులకు మనోధైర్యం అందించే విధంగా దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ గుర్తించి వారికి శాలువాలతో సత్కరించి సన్మానించడం జరిగిందన్నారు. ఎంతో మంది పేద విద్యార్థుల ట్యాలెంట్‌లను గుర్తించి దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ బహుమతులు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ తప్పకుండా ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు.

క్షయ రహిత సమాజం అందరి బాధ్యత

విశాలాంధ్ర - వల్లూరు : ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా మంగళవారం పిహెచ్‌సిల, సిహెచ్‌సిల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో వాతావరణంలో పెరిగిపోతున్న దుమ్మధూళి కాలుష్యం వల్ల సంభవించే క్షయవ్యాధి నిర్మూలించాలని, క్షయ రహిత సమాజం అందరి బాధ్యత అంటూ ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించి మానవహారాలుగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉర్దూ పాఠశాల నందు తమ కుటుంబాలు మొదలుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని క్షయ వ్యాధి దరిచెరునికుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శివరామిరెడ్డి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఇక్బాల్,టీబీ మమత సూపర్వైజర్ సునీల్ ఏఎన్ఎం నీలావతి, శ్రీదేవి ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగిజావ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర - మైదుకూరు : జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజన కార్యక్రమం) లో భాగంగా రాగిజావ కార్యక్రమాన్ని తిప్పిరెడ్డి పల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తిప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బండి నాగేంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ కోసం జగనన్న ఈ కార్యక్ర మాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయం అని అన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కృషితో పంచాయతీ లోని రెండు స్కూల్‌లో నాడు నేడు ప్రోగ్రామ్ ద్వారా స్కూల్‌కు వైభోగం వచ్చినది అని సర్పంచ్ తెలియ చేశారు.పిల్లలు మంచి పోషకాలు గల ఆహారం తీసుకొని గొప్పగా చదువు నేర్చుకోవాలని కోరారు. రాగిజావ ప్రతి మంగళ, గురు, శని వారాలలో పిల్లలకు ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వహకుడు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు

"ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్"

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : దేశ చరిత్రను ఇటీవల వక్రీకరించి దేశ ప్రజలకు తప్పుడు సమాచారంతో చరిత్రను చూపిస్తున్నారని ఆ విధంగా వక్రీకరిస్తే చరిత్ర హీనులు గానే మిగిలిపోతారని ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ అన్నారు. భారత స్వతంత్ర పోరాట చరిత్ర, సమైక్యతకు- నిదర్శనం అనే అంశంపై ముఖాముఖి కార్యక్రమం కడప నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న అజ్మత్ షాది ఖానా లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇటీవల కొంతమంది చరిత్రకారుల చేత చరిత్రను వక్రీకరించి రాయిస్తున్నారని ఇలా రాయించటం వల్ల దేశ ప్రజలకు తప్పుడు సమాచారం వెళుతుందని ఆరోజు దేశ ఐక్యత కోసం ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర ప్రజలకు తెలియకపోతే భవిష్యత్తు తరాలకు తప్పుడు సమాచారం వెళుతుందని ఆయన అన్నారు. ఇటీవల సినీ రచయిత మహారధి అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని చిత్రీకరించడంలో ఇందులో సీతాదేవిని తీసుకురావటం తప్పుడు సమాచారాన్ని దేశ ప్రజలకు తప్పుడు సమాచారాన్ని అందించటం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన బేగం హజరత్ మహల్ చరిత్ర ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఝాన్సీ లక్ష్మీబాయి చరిత్ర ప్రజలకు వివరించినట్లు బేగం హజరత్ మహల్ చరిత్రను కూడా దేశ ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. అదేవిధంగా సావిత్రిబాయి పూలే చదువుల తల్లి అనే విధంగా అదే సమయంలో వారికి నేనున్నానని తోడునీడగా నిలబడిన వ్యక్తి మొట్టమొదటి చదువుల తల్లి ఫాతిమా షేక్ చరిత్ర మరిచిపోకూడదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్సి జేఏసీ కన్వీనర్ బాబు భాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా, నాయకులు అబ్బాస్, న్యాయవాది ఎండి అలీఖాన్, ఐటా నాయకులు నజీర్ భాష, ఫక్రుద్దీన్, ఫయాజ్, ఎస్టియు నాయకులు మహబూబ్ బాషా, మహబూబ్, ఇన్సాబ్, నగర కార్యదర్శి మైనుద్దీన్, ఆప్ కి ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు ఆరిఫ్, వివిధ ప్రజా సంఘాల పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : మంగళవారం నాడు కడప నగరంలోని చిన్నచౌక్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి అక్కడ చదివే విద్యార్థులతో సమావేశమై ప్రతి విద్యార్థి నిజ జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని చదువుతో పాటు ఆటలు పాటలు మాటలలో నైపుణ్యం సంపాదించాలని అదే విధంగా రెగ్యులర్ పాఠ్య పుస్తకాలే కాకుండా సమాజం గురించి సమాజంలో జరిగే సంఘటనల గురించి పేదరికం గురించి చివరిగా తల్లిదండ్రుల గురించి చదవాలని తల్లిదండ్రులు పడే కష్టాలను గుర్తించాలని ఉన్నత స్థానం కోసం ఒక లక్ష్యం తోటి తపన తోటి చదవాలని కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ఆయన తెలిపారు. అదే విధంగా సమాజంలో ఎదుర్కొనే ప్రతి అవమానాన్ని పాజిటివ్‌గా తీసుకొని ముందుకు పోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థి సమాజంలో ఎదగడానికి కోపతాపాలను అదుపులో పెట్టుకొని ఆత్మవిశ్వాసం తోటి నమ్మకం తోటి ప్రయత్నం చేయాలని విజయం సాధించే వరకు ప్రయత్న లోపం ఉండరాదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి మిట్ట కేశవ రెడ్డి, స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు



విశాలాంధ్ర - కమలాపురం : నగరం వెన్నెల ఇంగ్లీష్ మీడియం (ప్రైవేట్) పాఠశాలలో మంగళవారం ఆ పాఠశాల కరస్పాండెంట్ అప్పాజీ ప్రవీణ్ ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని తరగతి గదులన్నీ వివిధ రకాల రంగులతో ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు ఉగాది పండుగ విశిష్ట అంతకుముందే ఉగాది పచ్చడి ఉగాది ఊరగాయ తదితర అంశాలపై విద్యార్థులకు తెలిపారు. తెలుగు సంవత్సరం లోని ఉగాది నుంచి ప్రారంభం అవుతుంది అని శోభకృతి నామ సంవత్సరం కూడా విద్యార్థులు గురించి విద్యార్థులందరూ జీవితా లలో వెలుగు నింపాలని సంతోషాలతో ఆరోగ్యాలతో వర్ధిల్లాలని వారి ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులుపాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామాగ్రి వితరణ

విశాలాంధ్ర - కమలాపురం : నగరంలోని బీడీ కాలనీకి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుమారు వంద మందికి పైగా నోట్ పుస్తకాలు, అట్టలు, కంబాక్సులు నగరానికి చెందిన పీఎండీ రఫీ వితరణగా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పీఎండీ రఫీ మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా విద్యాదానం చాలా గొప్పదని పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న వారిలో మెజారిటీ సంఖ్యలో పేద విద్యార్థులు ఉన్నారని ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యా సామాగ్రికి వారు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పుస్తకాలు, విద్యా సామాగ్రిని అందించానన్నారు. పాఠశాల విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

అపరిశుభ్రంగా ఉంచితే రూ.5 వేలు జరిమానా

విశాలాంధ్ర-సిద్దవటం : మాధవరం -1 గ్రామ పంచాయితీలోని దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘించి దుకాణాల ఎదుట అపరిశుభ్రంగా ఉంచినా, వ్యాపార స్థలములో రోడ్డు మీద చెత్తను వేస్తే రూ. 5వేలు రూపాయలు జరిమానా విధించడం జరుగు తుందని మాధవరం -1 సర్పంచ్ అవ్వారు జానకి రామయ్య హెచ్చరించారు. కడప -చెన్నై జాతీయ రహదారికి ఇరువైపులా వున్న దుకాణాలను ఆయన మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణాల ఎదుట అపరిశుభ్రంగా వ్యాపార స్థలములో రోడ్డు మీద చెత్త వేసి ఉండడంతో దుకాణాల యజమానులకు మొదటి విడతగా హెచ్చరిక చేశారు. రెండవ సారి నిభందనలు ఉల్లంఘిం చిన దుకాణము యొక్క అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించా రు. దుకాణాల యజమానులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాల న్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల దృష్ట్యా జిల్లా అధికారులు మాధవరం మీదుగా ప్రయాణిస్తారన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తే జరిమానా తప్పదన్నారు. దుకాణాల యజమానులు పంచాయతీకి సహకరించాలని కోరారు.

నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాల యంలో ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను మంగళవారం వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డిలు పరిశీలించారు. మున్సిపల్ కార్యాల య పరిధిలో పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్ర పరచాలని వారు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుభాష్‌చంద్రబోస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళీధర్, టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడంపల్లె ఉర్దూ హైస్కూల్‌లో రాగిజావ పంపిణి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని మున్సిపల్ ఉర్దూ హూస్కూల్ మోడంపల్లిలో 481 మంది విధ్యార్థులకు మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాగిజావను విధ్యార్థులకు పంపిణి చేశారు. పౌష్టికాహార పంపిణీ లో భాగంగా విధ్యార్థులకు క్యాల్షియం, ఐరన్ వంటి విటమిన్లు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విధ్యార్థులకు రాగిజావ ఇవ్వడం హర్శనీయం అన్నారు. విధ్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఫి, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ కాలేశా, ప్రధానోపాధ్యాయులు ఇమాంహుస్సేన్, ఉపాధ్యాయులు మునెమ్మ, గౌస్ మొహీద్దీన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర అన్నమయ్య జిల్లా



శ్రీ చైతన్య లో ముందస్తు ఉగాది వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట: పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డు లో ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం ఏజీఎం రమణయ్య, ప్రిన్సిపాల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగ ఉగాది అన్నారు. ఈ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శోభకృతు నామ ఉగాది సందర్భంగా విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు తెలుగు పండగల యొక్క విశిష్టతను తెలుసుకోవాలన్నారు. ఈ ఏడాది కూడా ప్రకృతి అనుకూలించి, పంటలు బాగా పండాలని, ఆయురారోగ్యాలు సిద్ధించాలని, అభివృద్ధి పథాన పయనించాలని కోరారు. ఎటువంటి ఆపదలు రాకుండా, ఈ ఏడాది పొడవునా విజయం, అదృష్టం ప్రజల వెంటే ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి విజయాలను, జిల్లా క్రీడాకారులు పోటీల్లో ఘనవిజయాలను సాధించి, మన జిల్లాకు గొప్ప పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. రెట్టించిన ఉత్తేజంతో, సరికొత్త ఆశలతో, కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని కోరారు. ఈ వేడుకల్లో భాగంగానే విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలు జరుపుకున్నారు. చివరిగా ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇంచార్జ్ శ్రీనివాసులు, ప్రైమరీ ఇంచార్జ్ కస్తూరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ప్రకటనలు మాని రైతాంగాన్ని ఆదుకోవాలి: జనసేన

విశాలాంధ్ర-చిట్వేలి : ముఖ్యమంత్రి ప్రకటనలు మాని రైతులను ఆదుకోవాలని లేకుంటే జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. ఉమ్మడి కడప జిల్లా చిట్వేలి మండలంలో అరటి బొప్పాయి పంటలకు అకాల వర్షాలు వడగండ్ల వాన వల్ల అపారమైన నష్టం కలిగిన రైతులను జనసేన పార్టీ నాయకులు పరామర్శించి నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికీ ఎవరూ ఏ అధికారి మా వద్దకు రాలేదని కన్నీటి పర్యంతమయ్యారు. చేతికందిన అరటి తోటలు కూలి పోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ప్రభుత్వం మాకు మళ్ళీ పంట వేసుకోవడానికి అండగా నిలబడాలని,పంట నష్టం చెల్లించాలని వేడుకున్నారు.. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ అసలు అసెంబ్లీలో ప్రధానంగా ఇప్పుడు చర్చించాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయి అంటే పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ఉన్న ఎమ్మెల్యే లందరూ కూడా ఈ అకాల వర్షం వల్ల అపారంగ నష్టపోయినటువంటి మామిడి బొప్పాయి రకరకాల పంట రైతులను వాళ్లను ఏ విధంగా ఆదుకోవాలిమన అధికారుల చేత ఎంత నష్టం వచ్చింది అని అంచనా వేయించాలి వాటి మీద చర్చ జరగాలి అసెంబ్లీలో కనీసం వీటి ప్రస్తావన కూడా తీసుకొని రాకపోవడం శోచనీయం అన్నారు. వెంటనే అధికారులను ఉద్దేశించి కనీసం మరో పంటని వాళ్లని వేసుకోవడానికి ప్రభుత్వం అండగా నిలబడాలని ఆయన అన్నారు. ఈ పర్యటనలో రైతు సుంకర శ్రీనివాస్ భాకరాపురం కొత్తపల్లి మరాటపల్లి రైతు పందికాళ్ల శంకరయ్య, తిమ్మయ్య గారిపల్లి కాటూరి లక్ష్మి నరసయ్య, కొమ్మి శ్రీను తదితరుల తోటలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ పగడాల వెంకటేష్, అంకీ శెట్టి మణి, పగడాల శివ కంచర్ల సుధీర్ రెడ్డి,మాదాసు శివ, షేక్ రియాజ్,ఆనందాల తేజ,తుపాకుల పెంచలయ్య,పురం గిరి సువ్వారపు హరిపసలశివ నీలికృష్ణ, మాదినేని హరి నాగిసెట్టి శివ పాల్గొన్నారు.

పోషక విలువలలో చిరుధాన్యాలు రారాజులు

విశాలాంధ్ర-చిట్వేలి : పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మర్లోపల్లి సచివాలయం చిరు ధాన్యాలు పోషక విలువల పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిర్మల తెలిపారు. రోజువారీ ఆహారంలో చిరు ధాన్యాలు చేర్చడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి కమిటీ అవగాహన కల్పించారు. ఆహారంలో విలువైన పోషక విలువలలో చిరు ధాన్యాలు రారాజులని సజ్జలు రాగులు జొన్నలు వంటివి ఆహారంలో విలువైన పోషక విలువలు కలిగినవని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ ఉదయ్, తల్లులు, గర్భవతులు, బాలింతలు, అంగన్వాడి కార్యకర్తలు సుజన, సుజాత, శ్రీదేవి, విజయ, ఏఎన్ఎం కల్పన, ఎంఎల్‌టిఓ శిరీష, మహిళలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దలో రాగి జావ

విశాలాంధ్ర-చిట్వేలి : శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ వారి ఆర్థిక సహకారంతో పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద'లో భాగంగా వారానికి మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ కూడా అందిజేస్తునట్లు ప్రధనోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పథకానికి అవసరమైన రాగి పిండి, బెల్లం పిండిలను రూ.42 కోట్ల ఖర్చుతో 3 సంవత్సరాల పాటు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారు సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చు కుంది. ఈ సంవత్సరం 2023 ను ఐక్యరాజ్యసమితి "అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరం" గా ప్రకటించింది. అందులో భాగంగానే విద్యార్థులకు ఐరన్, కాల్షియం సమృద్ధిగా లభించే రాగి, బెల్లం మిశ్రమ జావను అందిస్తున్నట్లు ట్రస్ట్ పేర్కొంది.

విజయభారతిలో స్పోర్ట్స్ డే

విశాలాంధ్ర- మదనపల్లి: విజయభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో స్పోర్ట్స్ డే సందర్భంగా డాక్టర్ ఎన్ సేతు మాట్లాడుతూ చదువులతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు మొదటి స్థానంలో ఉండాలని వారిలో దాగిన క్రీడా నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ స్పోర్ట్స్ డేను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ వ్యవస్థాపకులు పి టీఎం శివప్రసాద్, విజయభారతి స్కూల్ ఉపాధ్యా యులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవం

విశాలాంధ్ర- మదనపల్లి: మహిళలు అన్ని రంగాలలో రాణించి పురుషులతో పోటీ పడుతూ రాణించడం శుభ పరిణా మం అని శాప్ అన్నమయ్య జిల్లా కోచ్ షఫీ, యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏ.ఆర్.సురేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, యూత్ కరాటే క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని కోటబిడి నందు ఘనంగా నిర్వహించారు. మాతృమూర్తులు, సచివాలయ వార్డు మహిళ పోలీసులు, విద్యార్థినిలకు మ్యూజి కల్చర్, లెమన్ అండ్ స్పూన్, స్కిప్పింగ్ వంటి అనేక క్రీడా కార్యక్రమాలు నిర్వహించి పోటీల వారికి బహుమతులు అందజేశారు. మహిళ ఎక్కడ పూజింప బడుతుందో అక్కడ సుఖ సంతోషాలు వుంటాయని వారు పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో దూసుకు పోతున్నారని కొనియాడారు. సమాజంలో ఇంక అక్కడక్కడా వివక్షత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి ఎం.మణి సాయి, కరాటే మాస్ట ర్లు మహేశ్వర్, షేక్ మిస్బా, జోషిత రెడ్డి , గౌరవ మాతృమూర్తులు, మహిళా సోదరీ మణులు, కరాటే విద్యార్థినిలు పాల్గొన్నారు.

అక్రమ మట్టితరలింపుపై చర్యలు తీసుకోవాలి

- అనధికార లేవుట్ల పై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు నియోజకవర్గంలోని కెవి పల్లి మండలంలో రాయచోటి - పీలేరు జాతీయ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా లేవుట్లు వేసి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు యం.సాంబశివ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖల అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి వందలాది ట్రాక్టర్లతో,టిప్పర్లతో తరలిస్తున్నారని, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు మామూళ్లు మత్తులో పడి మైనింగ్ మాఫియాను,రియల్టర్లను ప్రోత్సాహిస్తున్నారని ఆయన తెలిపారు. అధికార పార్టీ నాయకుల ఆశీస్సులతో మైనింగ్ మాఫియా,భూ మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయని, అనధికార లేవుట్లపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేవుట్లను తొలగించాలని, అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నవారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వీర జవాన్ స్మారక స్థూపం ఏర్పాటు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సంబేపల్లి మండలం దేవపట కు చెందిన వీర జవాన్ దేవర ఇంటి రాజశేఖర్ స్మారక స్థూపాన్ని మంగళవారం కలెక్టర్ పిఎస్ గిరీష, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మిలటరీ విభాగం అధికారులు ఆయుష్ దీపక్ జితేందర్ సింగ్ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన స్మారక స్థూపం వద్ద మిలటరీ విభాగం అధికారిక లాంచనాలతో స్మారక స్థూపాన్ని ప్రారంభించారు. ఇండో టిబెటిస్ బార్డర్ పోలీస్ గా దేవర ఇంటి రాజశేఖర్ విధులు నిర్వర్తిస్తూ అమర్నాథ్ యాత్ర ముగించుకొని తిరిగి వస్తూ బస్సు ప్రమాదంలో18 ఆగస్టు 2022లో వీర మరణం పొందారు. వీర జవాన్ల జ్ఞాపకార్థం స్మారకస్తూపాలను ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. కడప డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచులు చిదంబ రెడ్డి ఉదయకుమార్ రెడ్డి వీర జవాన్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. వందనం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థిక సహకారాన్ని అందిస్తా మన్నారు. జవాన్ భార్యకు ఉద్యోగం కూడా కల్పిస్తున్నట్లు తెలియజేశారు. వీర జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో రాయచోటి డిఎస్పి శ్రీధర్ స్థానిక మండల ఉపాధ్యక్షుడు పోతురి రవీందర్ నాయుడు ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మిలిటరీ అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అదనపు శక్తి కోసం రాగిజావ

వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి

విశాలాంధ్ర-గాలివీడు:విద్యార్థులకు పౌష్టికాహారంలో భాగంగా అదనపు శక్తి కోసం బలవర్థక పానీయమైన రాగిజావను పంపిణీ చేస్తున్నట్లు వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ చక్రేనాయక్ తో కలసి జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థుల మెనూపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న జగనన్న ప్రభుత్వం పిల్లల్లో ఐరన్, కాల్షియం, లోపాలు లేకుండా నివారించడానికి రాగిజావను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేగాక జగనన్న గోరుముద్దలో మొత్తం 15 రకాల ఆహార పదార్థాలు పిల్లలకు అందిస్తున్నామని తెలిపారు.వారంలో ఐదు రోజులపాటు ఉడికిం చిన గుడ్లు ఇస్తున్నామని, మూడు రోజులు చిక్కి ఇస్తున్నామని, మిగిలిన మూడు రోజులు మంగళ, గురువారం, శనివారాల్లో రాగి జావ ఇవ్వటం ఈ రోజునుంచి ప్రారంభించడం జరిగిందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్.ఎం రెడ్డన్న, వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేల దాడి బాధాకరం: టిడిపి

విశాలాంధ్ర-రామాపురం : అన్నమయ్య జిల్లా విజిలన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సగినాల శివశంకర్ మాట్లాడుతూ ఒక దళిత శాసనసభ్యుడు మీద దేవాలయం లాంటి శాసనసభ లో టీడీపీ ఎమ్మెల్యేలు ఆయన పైన చెయ్యి చేసుకోవటం చాలా బాధాకరం.. దళితులు కోసం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వృద్ధికి జగనన్న ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంటే టీడీపీ ఎమ్మెల్యేలు దళితుల మీద చేస్తున్న అణిచివేత యావత్ దళిత సమాజంపై జరిగిన దాడిగా భావిస్తు ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము అని ఆయన అన్నారు. దళితులు పట్ల జరుగుతున్న ఈ దాడుల వల్ల చంద్రబాబు కి రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికలలో దళితులు తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ

విశాలాంధ్ర-నందలూరు :: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న గోరుముద్ద లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపిపి మేడా విజయ భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం పాఠశాల విద్యార్థులకు రాగి జావా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగిజావతో విద్యార్థులకు మంచి పోషకాహారం అందజేసినట్లవుతుందని, రక్తహీనత నుండి కాపాడినట్లవుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికీ 10 గ్రాముల రాగిపొడి, 10 గ్రాముల బెల్లం, కొద్దిగా ఉప్పు చొప్పున వేడి నీటిలో వేసి తయారుచేసిన రాగిజావను 150 మి.లీ. చొప్పున అందజేస్తారని, ప్రతి మంగళ,గురు, శని వారాల్లో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎంఈఓ గంగిరెడ్డి, వైకాపా నాయకులు జెసిబి సుబ్బారెడ్డి. జిల్లా వక్ఫ్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, గుణాయధవ్. ఆకేపా టి రమేష్ రెడ్డి. మట్టిబాబు. శ్రీదర్, సుబ్బరామిరెడ్డి. నాగేంద్ర వెంకటేష్, సాయి. కామాక్షి ఉపాధ్యాయులు, అల్లం అశోక్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి రాగి జావ పంపిణీ

విశాలాంధ్ర- మదనపల్లి : విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి రాగి జావ పంపిణీ చేయనుంది. మదనపల్లి నెహ్రూ మునిసిపల్ హై స్కూల్ నందు 23 వార్డు కౌన్సిలర్ గిరిజా సాయి శేఖర్ రెడ్డి రాగి జావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు గిరిజా సాయి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మంగళ వారం, గురువారం, శనివారం జావ ఉదయం పూట అందిస్తారు. జిల్లాలో 2353 పాఠశాలలో 303237 మంది విద్యార్థు లకు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2457 పాఠశాలలో 1.64 లక్షల మందికి అందిస్తున్నారు. మిగిలిన మూడు రోజుల సోమవారం, బుధవారం, శుక్రవారంలో చిక్కీలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హె.ఎం హరికృష్ణ,నాగ సులోచన, స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారాయి స్వాధీనం- ఒకరు అరెస్ట్

విశాలాంధ్ర-పీలేరు: 3 లీటర్ల సారాయి స్వాధీనం,తో పాటు ఒకరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పీలేరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ.వై. గురుప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాటలాడుతూ కె .వి.పల్లి మండలము జిల్లెళ్ల మంధ పెద్ద తండా గ్రామము లో దాడులు చేయగా అదే గ్రామానికి చెందిన చంద్ర నాయక్ 3 లీటర్ల సారాయి కలిగి ఉండగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టు లో హాజరు పరిచామని తెలిపారు. ఈ దాడులలో పీలేరు ఎస్ఈబి ఎస్ ఐ.లక్ష్మి నరసయ్య,హెడ్ కానిస్టేబుల్ యోగానంద, కానిస్టేబుల్ సుధాకర్, లు పాల్గొన్నారు.

మిట్స్‌లో వరల్డ్ పోయెట్రీ డే

విశాలాంధ్ర-మదనపల్లి: ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ వారు విద్యార్థులకు పోయెట్రీ పై గల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లో ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ విభాగాధిపతి డాక్టర్ అథఃర్ సమీనా మాట్లాడుతూ మనసులో మెదిలే భావాలను కళాత్మక రూపంలో వర్ణించేదే కవిత (పొయట్రీ) అని అన్నారు. సమస్త మానవాళి అంగీకరించిన గొప్ప పద్ధతుల్లో కవిత్వం అనేది ఒకటి అని, కవిత్వం బోధనను ప్రోత్సహించడానికి, ప్రపంచవ్యాప్తంగా రచన సృష్టి, ప్రచురణ, పఠనాన్ని ప్రోత్సహించాలనే ఈ వరల్డ్ పోయెట్రీ డే ను జరుపు కుంటారన్నారు. అంతరించి పోతున్న ఎన్నో భాషలు, అందులోని పదాలను వెలికితీసి వాటిని భవిష్యత్ తరానికి సురక్షితంగా అందించేది కవిత అని అన్నారు. కవిత్వంలేని భాష లేదు.. కవిత్వానికి అందని భావమూ లేదన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ విభాగం వారు నిర్వహించారన్నారు. కార్యక్రమం కో ఆర్డినేటర్ పార్వతి, ఇంగ్లీష్ విభాగము అధ్యాపకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు గ్రామ పంచాయతి వేలపు నోటిఫికేషన్

రె.క. నెం. 06/2023. తేది: 21.03.2023.

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పీలేరు గ్రామ పంచాయతికి చెందిన 1). వారపు సంత 2). దినసరి కూరగాయల మార్కెట్టు 3)ప్రైవేటు బస్టాండు (ఎపిఎస్ ఆర్టీసి మినహా) 4)జంతువధశాలలు 2023-2024 సంవత్సరమునకు అనగా 01.04.2023 నుండి 31.03.2024 వరకు ఒక సంవత్సర కాలము వరకు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కును తేది: 28.03.2023న మంగళవారం ఉదయం 10.30 గం.లకు పీలేరు గ్రామ పంచాయతి కార్యాలయము ఆవరణలో పంచాయతి కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము వేయబడును. వేలము నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింద తెలిపిన వివరముల మేరకు ధరావత్తు మరియు సాల్వెన్సీ హాజరు పరచి వేలము నందు పాల్గొనవలెను.

వరుస సంఖ్య	వనరుల వివరములు	చెల్లించవలసిన డిపాజిట్టు	సాల్వెన్సీ ధృవపత్రము	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన డిపాజిట్టు
1.	2.	3.	4.	5
1.	వారపు సంత	3,00,000.00	3,00,000.00	6,00,000.00
2.	దినసరి మార్కెటు (మంగళవారము మినహాయించి)	1,00,000.00	1,00,000.00	2,00,000.00
3.	ప్రైవేటు బస్టాండు (ఎపిఎస్ ఆర్టీసి మినహా)	1,00,000.0	1,00,000.00	2,00,000.00
4.	జంతువధ శాల, మాంసపు అంగళ్ళు	50,000.00	50,000.00	1,00,000.00

వేలపు షరతులు: 1.వేలమునందు పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదు. 2. వేలము ధరావత్తు చెల్లించని వారు వేలములో పాల్గొనుటకు అనర్హులు. 3. 2023-2024 సంవత్సరమునకు వేలపు నోటిఫికేషన్ ప్రకారము పాటించవలసిన సూచనల మేరకు హెచ్చు పాటగా నిలిచిన గుత్తదారుడు, హెచ్చు పాట పూర్తి మొత్తమును (7)ఏడు రోజుల లోపల చెల్లించవలెయును. అట్లు చెల్లించని యెడల, చెల్లించిన ధరావత్తు మొత్తము గ్రామ పంచాయతీకి దండుగ కింద జమ చేసుకొని రెండవ పాటదారునికి అదే నిభందనలతో ఖాయపరచబడును. లేక మరు వేలము వేయబడును. 4. సాల్వెన్సీ ధృవ పత్రము లేనివారు చెల్లించవలసిన డిపాజిట్టుకు రెట్టింపు ధరావత్తును చెల్లించి వేలమునందు పాల్గొనవచ్చును. 5. వేలము పంచాయతీ కార్యదర్శిగాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. 6. వేలము రద్దుపరచుటకుగాని లేక వాయిదా వేయుటకుకాని వేలము వేయు అధికారికి పూర్తి అధికారము కలదు. 7. మిగతా వివరములు కార్యాలయపు పని వేళలయందు తెలుసుకొనవచ్చును.

గమనిక: 1. డిపాజిట్టును పంచాయతీ సెక్రటరీ, గ్రామ పంచాయతీ, పీలేరు వారి పేరున బ్యాంకు డి.డి/చెక్కు ద్వారా మాత్రమే స్వీకరించబడును. నగదు స్వీకరించబడదు. 2. వేలపు పాట మొత్తముపై 3% స్టాంపుడ్యూటీ తప్పనిసరిగా చెల్లించవలెను.

శ్రీ.కె. రెడ్డి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి (పూ.అ.భా) గ్రామ పంచాయతీ, పీలేరు.

శ్రీ. డా.* షేక్ హబీబ్ బాషా, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, పీలేరు. జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షులు, జిల్లా అభివృద్ధి సలహా మండలి సభ్యులు.

రాయచోటి విద్యార్థినికి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణానికి చెందిన పోలీస్ ఉద్యోగి వీరబల్లి వెంకటేశ్వ ర్లు కుమార్తె వీరబల్లి అఖిల గోల్డ్ మెడల్ అందుకుంది. ఈ మేరకు ఆమె హీరో మంచు మనోజ్ చేతుల మీదుగా విద్యార్థిని అఖిల గోల్డ్ మెడల్ ను అందుకుంది. మంగళ వారం తిరుపతి పట్టణం లోని మోహన్ బాబు యూనివర్సిటీ నందు జరిగిన యాన్యువల్ డే వేడుకలలో భాగంగా ఎంసీఏ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు గాను మోహన్ బాబు యూనివర్సిటీలో వీరబల్లి అఖిల ను గోల్డ్ మెడల్ తో ఘనంగా సత్కరించినట్లు కుటుంబ సభ్యులు, సోదరుడు వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ తన సోదరి అఖిల యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. చిన్న నాటి నుంచే విద్య పట్ల మక్కువ పెంచుకున్న తన సోదరి ఈ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని మెడల్స్ అందుకోవాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం రాగి జావ: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జగనన్న గోరు ముద్దలో భాగంగా విద్యార్థులకు మరో పౌష్టి కాహారం రాగి జావా అందించే కార్యక్రమం చాలా అద్భుతమైనదని కలెక్టర్ గిరీషా పిఎస్ తెలిపారు. జగనన్న గోరుముద్ద మరో పౌష్టికాహారం రాగి జావా అందించే బృహత్తర కార్యక్ర మా న్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి లాంఛనంగా ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈఓ పురుషోత్తం, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, విద్యార్థులు, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ.... మధ్యాహ్న భోజన పథకంలో ఇప్పటికే సమూల మార్పులు చేపట్టి జగనన్న గోరుముద్ద ద్వారా ప్రతి రోజూ రుచికరమైన మెనూతో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికా హార లోపాన్ని నివారించేందుకు వారానికి మూడు రోజులు బెల్లంతో కూడిన రాగిజావను అందించే మంచి కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీటన్నింటిని విద్యార్థులు బాగా సద్వినియోగం చేసుకొని, బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని కలెక్టర్ సూచించారు.

నారాయణ స్కూల్లో ముందస్తు ఉగాది సంబరాలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని బోస్నగర్లో గల నారాయణ స్కూల్లో మంగళ వారం ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఖాదర్ వలి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉగాది పచ్చడిని తయారుచేసి తోటి విద్యార్థులకు పంచి పెట్టారు. నారాయణ పాఠశాలల ఏజీఎం చెన్నకేశవరాజు ఉగాది పర్వదిన విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ శంకర్రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పారిశ్రామిక ప్రదర్శన విజయవంతం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:ఏపీ ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవ స్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్య క్ర మంలో భాగంగా మంగళ వా రం గవర్నమెంట్ డైట్ హైస్కూల్, రాయచోటిలో జిల్లా స్థాయి పారిశ్రామిక ప్రదర్శన నిర్వహిం చారు. జిల్లా లోని వివిధ పాఠశా లల నుంచి హాజరైన విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. గవర్నమెంట్ హైస్కూల్ డైట్ హెడ్ మాస్టర్ శ్యామల కార్యక్ర మాన్ని ప్రారంభించగా డైట్ కాలేజీ ప్రిన్సిపల్ శివ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్ రెడ్డి ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకు నేందుకు నిరంతరం కృషి చేయాలని సమస్యలను గుర్తిస్తూ అవకా శాలను అన్వేషిస్తూ మంచి పరిశ్రమలను ఏర్పాటు చేసి గొప్ప పారిశ్రా మిక వేత్తలుగా తయారు కావాలని ప్రేరణ కలిగించారు. విద్యార్థు లు పారిశ్రామిక అంశాలతో ప్రోటోటైప్స్ తయారు చేసి పారిశ్రామిక వేత్తలకు ఉండే మనస్తత్వంను, జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈఎండిపి శిక్షణ సహాయపడుతుంది అని డిస్టిక్ మేనేజర్ ఎన్.లక్ష్మీ నరసింహుడు వివరించారు. జిల్లాస్థాయి ప్రదర్శన నుండి రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి ఏపీ మోడల్ స్కూల్ చెందిన విద్యార్థులు స్పందించిన రూమ్ హీటర్, బురకాయలకోట మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులానికి చెందిన విద్యార్థుల రూపొందించిన స్నేక్ డిటెక్టర్ సెన్సార్ అను ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి వీరికి జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. .స్కూల్ అసిస్టెంట్ నారాయణ రావు కరుణాకర్ ,స్కూల్ కమిటీ చైర్మన్ బుజ్జి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు.

రాగిజావ విద్యార్థులకు చక్కని పౌష్టికాహారం

విశాలాంధ్ర-పీలేరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశములమేరకు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న గోరుముద్దలో భాగంగా మంగళవారం నుండి కొత్తగా ప్రారంభించిన " రాగిజావా "కార్యక్రమంను పీలేరు బాలికోన్నత పాఠశాలలో మండల విద్యా శాఖాధికారి యం బాలాజీనాయక్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. జయమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ కోమల తో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద(మధ్యాహ్న భోజనం) లో మంచి ఆహారంతోపాటు కోడి గుడ్లను,చిక్కీలను అందిస్తు న్నారని, దీనితో ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహారం బలోపేతంచేయుటకు ప్రభుత్వం 21నుండి రోజుమార్చిరోజు" రాగిజావా"ను (ప్రతివిద్యార్థికి 10గ్రాములు రాగిపిండి, 10గ్రాముల బెల్లంతో జావాను తయారుచేసి) అందిస్తున్నారని,ఇది పిల్లలకు బలమైన పౌష్టికాహారమని,విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని రాగిజావాను ప్రతి విద్యార్థి తప్పక తీసుకోవాలనితెలియచేస్తూ, విద్యార్థులకు రాగిజావాను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, సీ.ఆర్.పీ.లు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్,మాధవి పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో దళితవాడ: సిపిఐ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి మండలం అబ్బవరం గ్రామ పరిధిలోని పాత హరిజనవాడ అభివృద్ధికి ఆమడ దూరం ఉందని సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అబ్బవరం పాత హరిజనవాడ దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల పూర్తయినప్పటికీ నేటికీ దళితులు నివసిస్తున్న దళితవాడలు మాత్రం అభివృద్ధి చెందలేదని ఇందుకు నిదర్శనం ఈ పాత హరిజనవాడే అని అన్నారు ఇక్కడ దాదాపు 70 కుటుంబాలు నివసిస్తున్నారు.. కానీ వారి నివసిస్తున్న గృహాలు గత 40 సంవత్సరాల క్రితం మంజూరు చేసినవి కానీ ఒక్కొక్క ఇంటిలో మూడు నాలుగు కుటుంబాలు నివసిస్తున్నారు.. గోడలు మొత్తం నెర్రెలు చీలి ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయాందోళనలు జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వాలు మాత్రం దళిత బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గొప్పలు చెబుతున్నారు తప్ప జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న ఈ దళితవాడ ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదంటే ఈ పాలకుల చిత్తశుద్ధి ఎంతో అర్థమవుతుంది అని అన్నారు. ఇప్పటికే ఆ దళితవాడలో తీవ్రమైన తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కనీస సౌకర్యాలైన త్రాగునీరు డ్రైనేజీ వ్యవస్థ అర్హులైన అందరికీ గృహాలు అంగన్వాడీ మినీ సెంటర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో చలో కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు.

సకల శుభాలకు నాంది ఉగాది: ఎంఎల్ఏ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సకల శుభాలకు నాంది ఉగాది అని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. షడ్రుతువులు..షడ్రుచుల సమాహారం ఉగాది అని తెలిపారు. చారిత్రక ప్రకారం బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించినదీ, శాలివాహనశకం ప్రారంభమైనదీ, మహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించినదీ, శ్రీరామచంద్రుడికి పట్టాభిషేకం జరిగిందీ, ధర్మరాజు కిరీట ధారణ చేసినదీ ఉగాది రోజునేనని పురాణాలు చెప్తున్నాయన్నారు. తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిభింబించేలా, సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీశోభకృత్ నామ సంవత్సరంలో నూతన రాయ చోటి అన్నమయ్య జిల్లా అన్ని రంగా లలో అభివృద్ధి చెందాలని ఆయన అభిలషించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సుఖ సంతో షాలతో, ఆయురా రోగ్యాలతో, సిరి సంపద లతో ప్రజలందరూ జీవించాలని కోరు కుం టూ నియోజక వర్గ ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

దళిత గ్రామాలలో మౌలిక వసతులు కల్పించాలి

ఎంపీడీవోకు మాల మహానాడు ఐక్యవేదిక వినతి

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు మండలం దళిత గ్రామాలలో బాలం వారి పల్లి పంచాయతీ దుబ్బ హరిజనవాడ లో శిధిల వ్యవస్థలో ఉన్న అంగన్వాడీ భవనం వర్షపు నీరు వస్తే నిన్న , మొన్న పడిన వర్షాలకు ఇండ్లు ముంపుకు గురవుతున్నాయి దొడ్డిపల్లి పంచాయతీ బండమీద హరిజనవాడ లో మురికి కాలువ పారిశుద్ధ్య లోపం, పుదుపుతీత, ఎర్రగుంటపల్లి పంచాయతీ, ముదుపుల వేముల వారి పల్లి తాగునీటి బోరు వర్షాలు వస్తే, చిత్తూరు రోడ్ లో ఉన్న డంపింగ్ యార్డ్ నుంచి కలుషితం నీరు వచ్చి ముదుపుల వేముల వారి పల్లిలో తాగునీటి బోరు లో కలుషితం అవుతున్నాయి. ఏమాత్రం చిన్నపాటి వర్షం వస్తే నీరు కలుషితం అవుతున్నాయి. జాండ్ల పంచాయతీ పెద్ద హరిజనవాడ లో, సిసి రోడ్డు, డ్రైనేజ్ కాలువ ,చీరపురెడ్డి గారి పల్లి మురికి నీటి కాలువ, సిసి రోడ్, స్మశాన, వాటిక పై సమస్యలన్నీ కూడా పీలేరు మండలంలో షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబల్, బ్యాక్ వర్డ్ కాస్ట్, గ్రామాలలో అనేకమైన సమస్యలు ఉన్నాయి. తాగునీటి సమస్య, స్మశాన వాటికలు ,సిసి రోడ్లు, మురికి కాలువలు పై సమస్యలు పలు మార్లు పౌర హక్కుల దినోత్సవం సంద ర్భం గా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ మానిటింగ్ సమావేశం ఎన్నో మార్లు మాల మహానాడు ఐక్యవేదిక అధికారులకు తెలిపామని కానీ ఇంతవరకు శిథిలావస్థలో ఉన్న అంగన్వా డి భవనం, వర్షపు నీటితో ముంపు గురవుతున్న గ్రా మం, కలుషితం అవుతున్న త్రాగునీటి బోరు, కానీ లేదనిఇంతవరకుట్టించుకోలేదన్నారు.అధికారులు చిన్నచూపు చూడడం తగదని ,మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ తెలిపారు. ఈరోజు పై ,సమస్యల పైన, ఎంపీడీవో మాల మహానాడు ఐక్యవేదిక మండల ప్రధాన కార్యదర్శి బెల్లం పురుషోత్తం ఆధ్వర్యంలో అర్జీ అందించారు. ఎంపీడీవో ,ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా పై సమస్యలన్నీ ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి చూసి తక్షణం స్పందించి తాగునీటి బోరు శిథిలావస్థలో ఉన్న అంగన్వాడి భవనం, మండల ఫండ్ నుంచి కొత్త అంగనవాడి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వర్షపు నీటికి గురవుతున్న గ్రామాన్ని కూడా పరిష్కరిస్తామని, ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుఱ్ఱం నారాయణ ,రాయలసీమ రీజినల్ కన్వీనర్ చీకటి పల్లి రామాంజులు, జిల్లా నాయకులు నక్క వెంకటరమణ గామద్దెల రమేష్, జి ఎన్ రాజు,లీగల్ సెల్ అధ్యక్షులు విశ్వకాంత్ బాబు , మండల నాయకులు మల్లేపల్లి రామచంద్ర, దుబ్బాఖ గేంద్ర , పి నాగరాజు, పి నారాయణ, పి లోకేష్, కే అమర్నాథ్,పి ఆదినారాయణ మాజీ సర్పంచ్, ఎస్ హరిబాబు ,కమిటీ మెంబర్ జి బాబు, జి సురేష్, ఆర్ ద్వారక, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గుంతాటి మురళి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాజంపేట నియోజకవర్గ ప్రజలకు,
అధికారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు, బంధువులకు,
శోభకృతు నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు
మీ
శ్రీ కె.జె.యస్. చంద్రారెడ్డి, బి.ఇ.,
కార్యనిర్వహక ఇంజనీరు,
పంచాయతీ రాజ్ డివిజన్ (పిఆర్ఐ)
రాజంపేట, అన్నమయ్యజిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - పంచాయతిరాజ్ ఇంజనీరింగ్ విభాగము - డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు V&QC, పి.ఆర్., మదనపల్లి వారి ఆఫీసు టెండరు నోటీసు, 1 / 2022 - 23, తేది. 20-03-2023

పంచాయతీరాజ్ విజిలెన్స్ & క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ మదనపల్లి ఆఫీసునకు(ఏప్రిల్ 2023-మార్చి 2024) బాడుగ వాహనము కావలెను. పాల్గొనదలచిన వారు ఈ క్రింది చిరునామాను సంప్రదించగలరు.

షెడ్యూల్ తీసుకొను తేది:	23.03.2023 నుండి 29.03.2023 సమయం మ॥ 3.00 గం॥లకు
టెండరు షెడ్యూల్ చివరి తేది:	31.03.2023 ఉ॥ 10.00 గం॥ల నుండి మధ్యాహ్నం 3.00 గం॥ల వరకు
టెండరు తెరుచు సమయం	:31.03.2023వ తేది సాయంత్రం 4.00 గం॥లకు
అడ్రసు	:డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజిలెన్స్ & క్వాలిటీ కంట్రోల్ (పి.ఆర్), సబ్ డివిజన్, జెడ్. పి. కాంపౌండు, మదనపల్లి.

నూతన జీవితానికి నాంది ఉగాది

నేడు శ్రీ శోభకృత్ నామ సంవత్సరం

విశాలాంధ్ర -రాజంపేట: హిందువుల పండుగల్లో ఓ ప్రత్యేకమైన దైవాన్ని తలుచుకునే పండుగలు కొన్నయితే, కాలానికి అనుగుణంగా జరుపుకొనే పండుగలు మరికొన్ని. ఇలాంటివాటిలో ముందుగా చెప్పుకోవాల్సింది ఉగాదినే. ఒకప్పుడు వ్యవసాయం మీద ఆధారపడుతూ, ప్రకృతిని గమనించుకుంటూ సాగిన మన పెద్దలకు, ఉగాది పెద్ద పండుగే! ఎందుకంటే ఆకురాలు కాలం ముగిసి వసంతరుతువు మొదలయ్యే సమయం ఇది.ఉగాది అన్న పదాన్ని యుగాదిగా చెప్పుకోవడం ఉంది. ఉగ అన్న మాటకు నక్షత్ర గమనం అన్న అర్థం కూడా ఉంది కాబట్టి అలా చూసినా సరికొత్త కాలం మొదలయ్యే సమయంగానూ చెప్పుకోవచ్చు. వ్యవసాయపరంగా పొలం పనులను ఆరంభించే సమయం ఇది. కోతలు పూర్తయి ఎండిన పొలాన్ని తిరిగి తొలకరికి అనువుగా సిద్ధం చేసుకునేవాళ్లు. అందుకే ఈ రోజు నాగలి పూజ, గాడి పూజ చేసి అరకు కట్టే ఆచారం నేటికీ ఉందని చెప్పడంలో సందేహం లేదు.ఉగాది పచ్చడిలో కనిపించే షడ్రుచులూ జీవితంలో కష్టసుఖాలను సమానంగా తీసుకోవాలి అనే సూచనతో పాటుగా ప్రకృతి పరంగా ఆ కాలంలో వేప చిగుళ్లు, మామిడి ముక్కలను ప్రసాదంగా మార్చడం కనిపిస్తుంది. సాధారణంగా మనకు లభించినదాన్ని భగవదార్పితం చేసి స్వీకరిస్తాం. అలా ఈ సరికొత్త సృష్టి సైతం ఆయన దయ అన్న కృతజ్ఞత ఇందులో స్పష్టం అవుతుంది.ఉగాది నుంచి వేసవి మొదలవుతుంది. సంక్రాంతికి అందిన డబ్బు నిదానం వ్యవసాయం మీద పెట్టుబడికి మళ్లుతుంది. అందుకే ఇంట్లో పెళ్లి జరిగినప్పుడు మరుసటి ఉగాదికల్లా పెళ్లికూతురికి కావల్సిన సారె పంపించేయాలని పెద్దలు చెప్పేవాళ్లు. తన కొత్త కాపురానికి అవసరమయ్యే పాత్రలు, వస్తువులు ఇలా ఉగాదిలోగా పంపడాన్ని ఉగాదిసారెగా పేర్కొంటారు. మొత్తానికి ఉగాది తెలుగువారికి ఓ కొత్త సంవత్సరం. ఆ మాటకు వస్తే కన్నడిగులు, మరాఠీలకు కూడా ఈ రోజే నూతన సంవత్సరం. తమిళనాడు నుంచి మణిపూర్ వరకు కొంచెం అటూఇటూగా ఇదే మాసంలో ఉగాది వస్తుంది. ఉగాది రోజున సృష్టి ఆరంభం జరిగిందన్న మాట ఓ నమ్మకమే అయినా ఆ రోజు నుంచి ప్రకృతి సరికొత్త జీవంతో తొణికిసలాడుతుందన్నది మాత్రం వాస్తవమే! అందుకే ఉగాదిని ఓ వ్యవసాయ ఆధారిత పండుగగానే కాకుండా సరికొత్త జీవితాన్ని ఆరంభించే శుభ సమయంగానూ భావిస్తారు.

ఉగాది పచ్చడి ప్రాముఖ్యత: ఉగాది రోజు ముఖ్యమైన వంటకం ఉగాది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుంది. జీవితంలో అన్ని భావనలను చెప్పే భావం ఇందులో ఇమిడి ఉంది. పచ్చడి ఒక్కొక్క పదార్థం ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక అని చెప్పడంలో సందేహం లేదు.

చిరుధాన్యాలతోనే పిల్లలలో పౌష్టికత సాధ్యం

విశాలాంధ్ర - రామాపురం : చిన్నపిల్లల్లో చిరుధాన్యాలతో చేసిన ఆహారం పౌష్టికత ఇస్తుందని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వై పద్మావతి అన్నారు. మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని సుద్దమల్ల పంచాయితీఎర్రం రెడ్డిగారిపల్లె లోనే రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పోషణ పట్వాడ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్ర కార్యకర్తలు ఆయాలు ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రజ్వలనంచేశారు అనంతరం ఆమె మాట్లాడుతూ అత్యంత విలువైన పోషక పదార్థాలు చిరుధాన్యాలతోనే ఆహారం ప్రతి ఒక్కరు విధిగా ప్రతిరోజు తీసుకోవాలని సూచించారు. వీటిని ఉపయోగించడం వలన చాలా వరకు దీర్ఘకాలిక వ్యాధులను ఊబకాయం తగ్గించవచ్చునని ఆమె అన్నారు. అనంతరం చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ఆ ప్రదర్శనలు తిలకించి వాటి విలువలను కూడా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని నీలకంఠరావుపేట కసిరెడ్డి గారి పల్లి గోపగుడిపల్లి కల్పనాయి చెరువు పంచాయతీలకు సంబంధించిన అంగనవాడి కేంద్రాల కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

నేటినుండి శ్రీరామనవమి ఉత్సవాలు

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని పేట గ్రామంలో కొలువైన శ్రీ కోదండ రామాలయంలో ఉగాది రోజైన బుధవారం నుండి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొచ్చు రెడ్డయ్య పేర్కొన్నారు ఉగాది రోజున గణపతి పూజ స్వస్తివాచనము ఆలయ శుద్ధి మూలవర్లు ఉత్సవర్లకు పంచామృత అభిషేక సోడా శోప చార పూజలు విష్ణు సహస్రనామ పారాయణ పూజలు రాత్రివేళల ఉభయలు పూజలు ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 30న సీతారాముల కళ్యాణం మహోత్సవం శ్రీ సద్గురు దర్గా స్వామీజీ భక్తకోటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు రాగి జావా పంపిణీ

విశాలాంధ్ర -రాజంపేట : మండల కేంద్రంలోని డిబిఎన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పిల్లలకు పౌష్టిక ఆహారం రాగి జావా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజన్ స్వచ్ఛంద సంస్థ అధినేత పోతుగుంట రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు రాగి జావా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి రాజు, స్వర్ణలత, సరస్వతి పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



విశాలాంధ్ర-గాలివీడు: మండలకేంద్రంలోని గ్రంథాల యాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి ఎస్.అమీరుద్దీన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన లైబ్రరీలో వున్న పుస్తకాలను, పత్రికలను పరిశీలించారు.అనంతరం లైబ్రరీలో పనిచేస్తున్న సిబ్బందికి కొన్ని సూచనలు చేస్తూ గ్రంథాల యం నిర్దిష్ట సమయంలో తెరచి వుంచేలా సమయపాలన పాటిస్తూ, పాఠకులకు అందుబాటులో వుండేవిధంగా చూసుకోవాల న్నారు. అంతేకాకుండా డిమాండ్ కలిగిన పుస్తకాలను ప్రతీ రోజు రిజిస్టర్ లో నమోదుచేయలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.

చిన్నగొల్లపల్లెలో జగనన్న గోరుముద్ద

విశాలాంధ్ర - సుండుపల్లె : చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ నందు నూతనంగా రాగి జావా కార్యక్రమంలో సర్పంచ్ జయచంద్ర పాల్గొన్ని విద్యార్థులకు రాగి జావా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద పిల్లలకు పౌష్టికాహారంతో పాటు పేదరికంకు విద్య, ఆహారం అడ్డుకాకుడదనే దృఢ సంకల్పంతో పేదబిడ్డలే తమ పిల్లలగా భావించిన ఘనత మన ముఖ్యమంత్రి దని భావితరాలకు భవిష్యత్తుకు ఇప్పటినుండే పునాదులు వేస్తూ ఇలాంటి పౌష్టికాహారం ఇస్తూ పిల్లల జీవన ప్రమాణాలను పెంచుతూ మెరుగైన విద్య, వైద్యం అందజేస్తామని ముఖ్యమంత్రి ఆశయాల కోసం ఎల్లవేళలా చేతోడుగా ఉంటామని సర్పంచ్ తెలిపారు. పంచాయతీలో చిన్నగొల్లపల్లె, అన్నదాన్నంవాండ్లపల్లె, పూజారివాండ్లపల్లె, సర్రెడ్డిగారిపల్లె నందు యం పి.పి పాఠశాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాగి జావా ఆరోగ్యానికి ఎంతో మేలు

విశాలాంధ్ర-రామాపురం : పిల్లలకు పోషక విలువలను పెంచే రాగి జావా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని రామాపురం మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు అన్నారు. మండలంలోని ఓబుల్ రెడ్డి గారి పల్లె ప్రాథమిక పాఠశాల నందు మంగళ వారం జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద లో భాగంగా విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాగి జావా గుండె కండరాల పనితీరు, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. రాగి జావ సహజ ఇనుముకు గొప్ప మూలం. రక్తహీనత ఉన్నవారికి, తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు ఉన్నవారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుందని రాగి మాల్ట్ విటమిన్ సి స్థాయిలను పెంచుతుందని ఆయన తెలిపారు. రాగుల పై పొరలో మిగిలిన ధాన్యాలకంటే ఎక్కువ పాలిఫినాల్స్ ఉంటాయని రాగులు బ్లడ్ గ్లూకోజ్ లెవెల్స్ తగ్గించడమే కాకుండా హైపోగ్లైసీమిక్ స్ట్రెస్ ని తగ్గిస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో గాయం తొందరగా తగ్గడానికి కూడా ఇవి సహకరిస్తాయనీ కాబట్టి వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఈ బృహత్తరమైన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి రమేష్ రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎనిమిదో విడత అసైన్మెంట్ కమిటీలో నిరుపేదలకు భూములు పంచాలి

విశాలాంధ్ర - రాజంపేట: నిరుపేద కుటుంబాలకు ఎనిమిదో విడత అసైన్మెంట్ కమిటీ లో రెండు ఎకరాలు బంజర భూములు పంచాలని బి కే ఎం యు నాయకులు అన్నారు. రాజంపేట మండల కేంద్రంలోని చెర్లోపల్లి గ్రామపంచయతీ ఎస్టి కాలనీ, కారంపల్లి పంచాయతీ దుర్గాపురం ఎస్టి కాలనీలలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎం యు ఆధ్వర్యంలో పర్యటించారు ఈ సందర్భంగా ఎస్ టి కాలనీ నివాసులకు ప్రభుత్వ బంజర భూములు ఎనిమిదో విడత అసైన్మెంట్ కమిటీ సమావేశంలో ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి నిరుపేద దళిత, గిరిజనులకు ఎనిమిది విడతల భూ పంపిణీ కార్యక్రమం వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఒక రాజశేఖర్ రెడ్డికే దక్కిందన్నారు. తర్వాత టిడిపి ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నిరుపేదలకు ఒక సెంటు భూమి పంచిన పాపాన పోలేదని వారు దుయ్య పట్టారు. ఇప్పటికైనా చెర్లోపల్లి గ్రామపంచాయతీ, కారంపల్లి పంచాయతీ దుర్గాపురం ఎస్టి గిరిజనులకు కోనేరు రంగారావు కమిటీ సిఫారసు ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి రెండు ఎకరాలు ప్రభుత్వ బంజరు భూములు ఎనిమిదవ విడత అసైన్మెంట్ కమిటీలో ఇవ్వాలని లేనిపక్షంలో రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని రాజంపేట డివిజన్లో ఉన్న ఎస్సి,ఎస్టీ గ్రామాలను ఏకం చేసి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కే యం యు ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి పంచాయతీ, కారంపల్లి పంచాయతీ ఎస్టి కాలనీ నివాసులు నరసింహులు, వెంకటసుబ్బమ్మ, ఎల్లమ్మ, చెంచులక్ష్మి, వెంకటసుబ్బయ్య, ఎల్లయ్య, నరసింహులు, మహేష్, మధు, చంద్ర,గంగయ్య, రమణ, గంగులయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-గాలివీడు: అనారోగ్యంతో వున్న పెళ్లకూరి సునీల్ కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయం అందించినట్లు మానవత సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చేపడుతున్న అనేక సేవాకార్యక్రమాల్లో భాగమైన ఆత్మీయ సహకారంలో భాగంగా గాలివీడు మానవత యూనిట్ బృందం మంగళ కాలనీలో నివాసముంటున్న వెంకటేష్,పుష్పలత కుమా రుడు సునీల్ గత కొంతకాలంగా వెన్నుముక అరుగుదల, నరాల బలహీనతతో బాధపడుతున్న కారణంగా వైద్యఖ ర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసి నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబం అయినవారికి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ కన్వీనర్ శివారెడ్డి, డైరెక్టర్లు రామకృష్ణ రెడ్డి,నరసింహులు, దామోదర్, శశికుమార్, భాస్కర్,చంగల్ రాజు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి చిరుధాన్యాలే బలం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : చిన్న పిల్లలు ఆరోగ్యానికి చిరుధాన్యాలే బలం అని అంగన్ వాడి టీచర్ నంద్యాల సరోజమ్మ పేర్కొన్నారు. పుల్లంపేట సెక్టార్ -2 కేతరాజుపల్లి గ్రామంలో మంగళవారం సిడిపిఓ సౌభాగ్యమ్మ అద్వర్యంలో భవిష్యత్తు చిరుధాన్యాలదే పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సరోజమ్మ మాట్లాడుతూ మానసికంగా శారీరకంగా బలంగా ఉండడానికి చిరుధాన్యాలు తోడ్పడతాయన్నారు. మారుతున్నకాలంలో పిజ్జాలు బర్గర్లు అంటూ పసితనం నుండే ఆరోగ్యాన్ని పాడుచేసుకోకుండా పురాతన కాలం నాటి రాగులు సజ్జలు జొన్నలు కొర్రలు లాంటి చిరుధాన్యాలను అలవాటు చేయాలన్నారు. చిన్నపిల్లలకు చిరుధాన్యాల గురించి తల్లిదండ్రులు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్ శివ, అంగన్ వాడి కార్యకర్త జి.విజయ, హెల్పర్ నాగమణి పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిని త్వరత గతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర -రాజంపేట: పార్లమెం టు కేంద్రమైన రాజం పేటలో అసంపూర్తిగా ఉన్నటువంటి రైల్వే అండర్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తిచేసి ప్రజ లకు అందుబాటులోకి తీసుకు రావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ ఇన్చార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించి సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీష కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పనిని రాజంపేట రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి చేసి కొన్ని నెలలుగా వస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పనిని పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఇంతవరకు పూర్తి కాలేదని వారన్నారు. రైల్వే స్టేషన్ అటువైపున ప్రభుత్వ జూనియర్ కాలేజీ డిగ్రీ కళాశాల హైస్కూలు మరియు స్థానిక ప్రజలు వెళ్లడానికి ఎంతో సౌకర్యవంతంగా ఉండే ఈ బ్రిడ్జిని త్వరగా పూర్తిచేయాలన్నారు. రైల్వే ప్రయాణికులు రెండవ ప్లాట్ఫామ్ పైకి వెళ్లాలంటే వృద్ధులు మహిళలు వికలాంగులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి అయితే అందరికీ ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టుపోగుల ఆదినారాయణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బి. సుభద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి జీ.కే నాగరాజు, పట్టణ కార్యదర్శి పి రమణ, పట్టణ ఉపాధ్యక్షులు మాకం రవి, మండల ఉపాధ్యక్షులు రేణు ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

విశాలాంధ్ర-గాలివీడు: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు కలదని ఎస్సై వెంకట శివ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని స్థానిక రవిచంద్ర పాఠశాలలో పది విద్యార్థుల వీడుకోలు సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల కాలం సమీపిస్తున్నందున సమయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం షింటో, థామస్ లు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి నప్పుడే ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దబడతారన్నారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ బినయ్ ఫ్రాన్సిస్,ఉపాధ్యాయులు గరుడప్ప,రమేష్,మొయిన్ అక్తర్, ఆంజనేయులు, రామ్మోహన్,గౌస్ బాష,తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరిద్దాం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను దూరం పెట్టకుండా దగ్గరికి తీసి ఆదరించాలని డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులను కొంతమంది దత్తత తీసుకొని వారికి న్యూట్రిషన్ మంచి పోషక పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు చిన్నపరెడ్డి బంగ్రెడ్డి శంకర్ రెడ్డి సిహెచ్ఓ రవీంద్రలు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తకు తీసుకొని ఆరు నెలల పాటు ప్రతినెల మంచి పోషకాలనిచ్చే న్యూట్రిషన్ ఆహారాన్ని అందజేస్తామని వారు తెలిపారు. దాతలు మానవతా దృక్పథంతో క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరించడం వారి ఆరోగ్యాన్ని కాపాడడం ఎంతో గొప్ప విషయమని ఆయన కొనియాడారు. డాక్టర్ రిజ్వాన్, సతీష్, క్షయ వ్యాధి సూపర్వైజర్ హరి పాల్గొన్నారు.

రాగి మాల్టును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : రాగి జావాలు, మాల్టును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు. మంగళవారం ప్రతి పాఠశాలలోనూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాగి మాల్టాను విద్యార్థులు తాగితే రక్తహీనత తగ్గుతుందన్నారు. రాగి మాల్ట్ వలన విద్యార్థుల్లో శక్తిని పెంచి ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె అన్నారు. అలాగే లక్కిరెడ్డిపల్లి బాలికల పాఠశాలలో చైర్మన్ లక్ష్మీరాజ్యం చేతుల మీదుగా రాగి జావాలు, విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, అరుణ్, ఆసిఫా భాను, భారతి, శ్రీనివాసులు, మురళి నాయక్, సోమశేఖర నాయక్, రసూల్ ఉన్ సాహెబ్, సుధీర్ బాబు, రెడ్డమ్మ, సుజాత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

అన్నమాచార్యలో సీజీఆర్ టాలెంట్ మీట్-23 పోస్టర్ రిలీజ్

విశాలాంధ్ర -రాజంపేట: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాజంపేటలో మంగళవారం సీజీఆర్ టాలెంట్ మీట్ -23 పోస్టర్ ను కళాశాల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీఆర్ టాలెంట్ మీట్ నందు టెక్నికల్ సింపోజియం, ప్రాజెక్ట్ ఎక్స్ పో, పోస్టర్ ప్రజెంటేషన్, కల్చర్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్ అనే అంశాలు కలవని, ఈ కార్యక్రమం ఏప్రిల్ 3,4 లలో జరగనుందని, ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులలో వ్యక్తిగత నైపుణ్యం పెరుగుతుందని, అన్ని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని, కావున బిటెక్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ పోస్టర్ రిలీజ్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డాక్టర్ ఎం సుబ్బారావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం పద్మలలిత, ప్లేస్ మెంట్ అధికారి కె శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ నూకా సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి పోషణ పక్వడ ప్రోగ్రామ్ నందు అంగన్వాడీ సెంటర్లో మండల ప్రత్యేక అధికారి రామచంద్ర రెడ్డి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలు ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫోషకాలు లభించే ఆహారం తీసుకోవటం ద్వారా చిన్నపిల్లల ఆరోగ్యం కోసం మరియు ఫోషకాహర లోపాలను అరికట్టి వారు వయసుకు తగ్గ ఎత్తు బరువు పెరగటానికి మరియు గర్భవతులకు రక్త హీనత మరియు పోషకాహార లోపం తగ్గించుటకు ఎంతో ఉపయోగకరం అని తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమం నందు సుండుపల్లి స్పెషల్ ఆఫీసర్ రామ చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రామమోహన్, పల్గునా, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

నోటీసు బోర్డు తొలగించిన వారిని అరెస్టు చేయాలి :సిపిఐ

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలంలోని బాలిరెడ్డిపల్లి దళితుల గ్రామం పక్కనే ఉన్న వై.కోట రెవిన్యూ సర్వే నెంబరు 1155 లో 150 ఎకరాలు ప్రభుత్వ బంజరు భూమి ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ఓబులవారిపల్లి తాహశీల్దారు అద్వర్యంలో రెవిన్యూ సిబ్బంది నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు.అ నోటీసు బోర్డు ను రాత్రికిరాత్రికే తొలగించారు.నోటీసు బోర్డును తొలగించిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి సి నాగమ్మ తాసిల్దార్ పీరుమున్ని దృష్టికి తీసుకుపోయింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే కబ్జాదారులు నోటీసు బోర్డు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటే ఈ తతంగం అంతా రెవిన్యూ కనుసన్నలలో నే జరుగుతుందని విమర్శించారు. దొంగ ఆన్లైన్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక అధికారులు స్పందించకుంటే అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష దృష్టికి తీసుకుపోతామన్నారు.లేదా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఆలశ్యం చేయకుండా వెంటనే అభూమిని దళితులకు పంచాలని డిమాండ్ చేశారు.

రాగి జావ విద్యార్థులకు పౌష్టికాహారం

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులకు బలమైన ఆహారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యార్థులకు రాగిజావ కార్యక్రమం ప్రవేశపెట్టారు. అందులో భాగంగా మంగళవారం విద్యార్థినీ విద్యార్థులకు ఉదయం 11 గంటలకు ఇన్ఛార్జి హెచ్ఎం దాది ఆంజనేయులు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్ అజ్మతుల్లా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో విద్యార్థులకు రాగిజావ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ విద్యార్థులు రాగిజావ తాగడం వలన నరాల బలహీనత, బుద్ధిమాంద్యం (తెలివితేటలు), ఎముకల పటుత్వం, రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తప్పకుండా రాగిజావ తాగాలన్నారు. వారానికి మూడు రోజులు మంగళవారం, గురువారం, శనివారం ఉదయం 11 గంటలకు రాగిజావ అందిస్తారన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని గరుగుపల్లి గ్రామం చాంకూరోల్లపల్లెలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినట్లు విగ్రహదాత ఇందుకూరి ప్రభాకర్ తెలిపారు.ఈఘటనలో స్థానికంగా వున్న ఇరువురి భక్తులపై సందేహం ఉన్నట్లు వారు పిర్యాదులో పేర్కొన్నారు.ఆలయం గర్భగుడి తాళాలు వారిరువురి వద్దనే వుండగా హుండీ ఆదాయం కాజేసి చోరీ జరిగినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్న సదరు వ్యక్తులపై విచారణ జరిపి కాజేసిన సొమ్మును రికవరీ చేయాలని వారు పిర్యాదులో స్పష్టం చేశారు.

ఓటమిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యేలపై దాడి : టిడిపి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో జరిగిన ఘోర పరాజయాన్ని వైకాపా జీర్ణించుకోలేక తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు డోలా వీరాంజనేయులుస్వామి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి లపై వైకాపా ఎమ్మెల్యేలు దాడులు చేశారని నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు విమర్శించారు. మంగళవారం తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యాలయం వద్ద పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇదొక చీకటి రోజు (బ్లాక్ డే)గా అభివర్ణించారు. ప్రతిపక్ష టిడిపి శాసనసభ్యులపై అధికార పార్టీ వైకాపా ఎమ్మెల్యేలు గుండాల లాగా ప్రవర్తించి దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం తెచ్చారన్నారు. దేవాలయం లాంటి శాసనసభలోనే ఇలాంటి దాడులు జరగడం వైసిపి దుశ్చర్యలకు నిదర్శనమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ను రౌడీ రాజ్యంగా మార్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు మహిళలకు దళితులకు రక్షణ లేకుండా పోయిందని నిప్పులు చెరిగారు. ఈ ఘటనకు సంబంధించి శాసనసభలో రికార్డు చేసిన రికార్డింగ్ దృశ్యాలను వెంటనే విడుదల చేసి దాడికి పాల్పడిన వైకాపా ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇలాంటి పరిస్థితులను చూస్తూ ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శాసనసభ చరిత్రలో ఇంతవరకు ఏ ఎమ్మెల్యేల పైన దాడి జరిగిన ఘటన లేదన్నారు. ఇటువంటి అప్రజాస్వామ్య చర్యలు వైకాపా కే మాత్రమే సాధ్యమన్నారు. దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు.శాసనసభలో టిడిపి ఎమ్మెల్యేలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో టిడిపి రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు పులెల రమేష్ బాబు, సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, హస్తి చంద్రశేఖర్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు కొమ్మా శివ, పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తేనేపల్లి చిన్న, యువ నాయకులు విజయ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ఖండించారు.